# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :02 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 15-02-2024 | పేజీలు:4 వెల: 2.00


## టీఎస్ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్‌గా అపూర్వరావు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) నూతన జాయింట్ డైరక్టర్ గా కె.అపూర్వ రావు (ఐపీఎస్) బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ బస్ భవన్ లోని తన ఛాంబర్ లో ఆమె మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సీఐడీ, ఎస్పీగా విధులు నిర్వర్తిస్తోన్న అపూర్వరావుని టీఎస్ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ గా ప్రభుత్వం సోమవారం నియమించింది. హైదరాబాద్ చెందిన ఆమె.. 2014 ఐపీఎస్ బ్యాచ్ అధికారిణి. వనపర్తి, గద్వాల, నల్లగొండ జిల్లాలకు ఎస్పీగా గతంలో పనిచేశారు. టీఎస్ఆర్టీసీకి జాయింట్ డైరెక్టర్ గా ఒక మహిళా ఐపీఎస్ అధికారిణి నియమితులవడం ఇదే తొలిసారి. టీఎస్ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన కె.అపూర్వరావుకు సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ (ఐపీఎస్) శుభాకాంక్షలు తెలియజేశారు. సంస్థ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలని ఆమెకు సూచించారు. ప్రజా రవాణా వ్యవస్థను ప్రాముఖ్యతను గుర్తించి టీఎస్ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా మహిళా ఐపీఎస్ అధికారిని జాయింట్ డైరెక్టర్ గా నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సజ్జనర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## మెడికల్ కాలేజీలో ర్యాగింగ్... ఇంటి దారిపట్టిన విద్యార్థులు..



పెద్దపల్లి: ర్యాగింగ్ కట్టడికి ఎన్ని చర్యలు తీసుకున్నా కాలేజీలను ర్యాగింగ్ భూతం వదలడంలేదు. తరచుగా జూనియర్ విద్యార్థులు వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఎంత అవగాహన కల్పించిన ఫలితం లేకుండా పోయింది. ర్యాగింగ్ నుంచి తప్పించుకునేందుకు విద్యకు దూరమవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అలాంటి ఘటనే తాజాగా పెద్దపల్లి జిల్లా రామగుండం వైద్య కళాశాలలో జరిగింది.ర్యాంగింగ్ పేరుతో సీనియర్లు రెచ్చిపోయారు. అర్ధరాత్రి జూనియర్ల హాస్టల్ రూమ్ లలోకి చొరబడి వేధింపులకు గురిచేశారు. ఇద్దరు విద్యార్థులకు గుండ కొట్టి, మీసాలు తొలగించారు. దీంతో భయాందోళనకు లోనైన ఆ విద్యార్థులు తెల్లారి ఇంటికి వెళ్లిపోయారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీనియర్ల ఆగడాలతో విసిగిపోయిన జూనియర్ విద్యార్థులు కాలేజీలో ఆందోళన చేపట్టారు. వైస్ ప్రిన్సిపాల్ ఛాంబర్ ము ందు బైఠాయించారు. రామగుండం మెడికల్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ చదువుతూ, కాలేజీ అనుబంధంగా ఉన్న హాస్టల్ లో ఉంటున్న ఇద్దరు విద్యార్థుల గదుల్లోకి సీనియర్లు మూకుమ్మడిగా చొరబడ్డారు.జూనియర్లను ప్రశ్నలతో వేధిస్తూ జుట్టు అంతలా ఎందుకు పెంచారని నిలదీశారు. అనంతరం ట్రిమ్మర్ తో గుండు చేసి, మీసాలు కూడా తొలగించారు. వారితో పాటు మరో ముగ్గురు విద్యార్థులను కూడా ర్యాగింగ్ చేశారు.ఈ విషయాన్ని ఫోన్ లో తమ తల్లిదండ్రులకు వివరించిన బాధిత స్టూడెంట్లు.. ఉదయాన్నే ఇంటికి వెళ్లిపోయారు. కాగా, ర్యాగింగ్ పేరుతో సీనియర్లు చేస్తున్న ఆగడాలతో విసిగిపోయిన జూనియర్లు ఆందోళన చేపట్టారు. ర్యాగింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసి కాలేజీకి వెళ్లిన గోదావరిఖని పోలీసులు.. ర్యాగింగ్ ఘటనపై జూనియర్లను విచారించారు. దీనిపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వివరించారు.

## రణరంగమైన రైతుల 'ఢిల్లీచలో'



న్యూఢిల్లీ, ఫిబ్రవరి14ః తమ సమస్యల పరిష్కారం కోసం రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' రణరంగమైంది. రైతులు. పోలీసుల మధ్య పలు చోట్ల తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పంజాబ్, హరియాణాల నుంచి ఢిల్లీకి బయలుదేరిన రైతులు ఎన్ని అడ్డంకులెదురైనా లెక్కచేయడం లేదు. ఎలాగైనా ఢిల్లీ చేరుకుని ఆందోళన కొనసాగించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు రైతులను అడ్డుకునేందుకు పోలీసులూ అంతే స్థాయిలో ప్రయత్నిస్తున్నారు. ఒక రోజు ముందుగానే జాతీయ రహదారులపై బారికేడ్లు, అడ్డుగోడలు నిర్మించిన వారు మంగళవారం పంజాబ్, హరియాణాల్లో రైతులను ఎక్కడికక్కడ నిరోధిస్తున్నారు. అయితే బారికేడ్లను ధ్వంసం చేసుకుని మరీ రైతులు ముందుకు సాగుతున్నారు. దీంతో పోలీసులు బాష్ప వాయుగోళాలను, రబ్బర్ బులలెట్లను, జల ఫిరంగులను ప్రయోగించారు. డ్రోన్లనూ వినియోగించారు. ఈ ఘటనల్లో పలువురు పోలీసులు, రైతులు గాయపడ్డారు. ఇక దిల్లీలో పోలీసుల ఆంక్షలతో జనం నరకం చవి చూశారు. పలు రహదారుల్లో ట్రాఫిక్‌ను మళ్లించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. పలు మెట్రో స్టేషన్ల గేట్లను అధికారులు మూసి వేశారు. ఇటు కేంద్ర ప్రభుత్వం.. చర్చలకు సిద్ధమంటూనే ఇప్పటికిప్పుడు కనీస మద్దతు ధరపై చట్టం చేయలేమని చెబుతోంది. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా 'ఢిల్లీ చలో' ఆందోళనకు పిలుపునిచ్చాయి.పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ నుంచి ఉదయం 10 గంటలకు మహిళలతోసహా రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో దిల్లీకి బయలు దేరారు. బారికేడ్లను ధ్వంసం చేసేందుకు వారు జేసీబీనీ వెంట తెచ్చుకున్నారు. అక్కడికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరియాణా, పంజాబ్ సరిహద్దు ప్రాంతం శంభు నుంచి ముందుకు కదలకుండా పోలీసులు అడ్డుకున్నారు. పలుచోట్ల ముళ్ల కంచెలు, కాంక్రీటు దిమ్మెలు, మేకులతో రోడ్డుకు అడ్డుగా పోలీసులు పెట్టిన ఆటంకాలను తొలగించేందుకు రైతులు ప్రయత్నించారు. బారికేడ్లను ట్రాక్టర్లతో తొలగించేందుకు యత్నించగా పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. జల ఫిరంగులనూ రైతులపైకి పోలీసులు ప్రయోగించారు. దీంతో రైతులు పరుగులు పెట్టారు. బాష్ప వాయు గోళాల పొగ నుంచి రక్షణ కోసం రైతులు గోనె సంచీలను వినియోగించారు. భారీ సంఖ్యలో ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో శంభు సరిహద్దుకు చేరుకున్న రైతులు అడ్డుగా నిలిచిన పోలీసులపై రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు డ్రోన్ల ద్వారా బాష్ప వాయుగోళాలు జార విడిచారు. అయినా సరే బెదరకుండా ముందుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నాలు కొనసాగించారు. శంభువద్ద వంతెనకు రక్షణగా పెట్టిన రేకులను ధ్వంసం చేసి కిందపడేశారు. రోడ్డు మార్గం ద్వారా కాకుండా పక్కనే ఉన్న పొలాల ద్వారా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న రైతులను బాష్ప వాయు గోళాలతో అడ్డుకుంటున్నారు. ఆటంకాలను అధిగమించి పొలాల ద్వారా దిల్లీవైపు దూసుకెళ్తున్న కొందరు రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరియాణాలోని జింద్ వద్దా కర్షకులు ముందుకు వెళ్లకుండా రహదారిపై కాంక్రీటు స్లాబులు, ఇనుప మేకులు, ముళ్ల కంచెలతో అడ్డుకట్ట వేశారు. అయినా వెనక్కి తగ్గని రైతులపై బాష్ప వాయుగోళాలను ప్రయోగించారు. శంభువద్ద జరిగిన ఘర్షణలో డీఎస్పీసహా 24మంది పోలీసులు గాయపడ్డారు. వారిని అంబాలాలోని ఆసుపత్రికి తరలించారు. 60 మంది రైతులూ గాయపడ్డారు. హరియాణాలో 64 కంపెనీల పారా మిలిటరీ బలగాలను, 50 కంపెనీల పోలీసులను మోహరించారు. పంజాబ్‌వైపు నుంచి హైవే మార్గం ద్వారా ఢిల్లీలోకి ప్రవేశించే రైతులను అడ్డుకునేందుకు అంబాలా-శంభు సరిహద్దులో పోలీసులు ఏర్పాటు చేసిన భారీ సిమెంటు దిమ్మెలను గ్రామస్థులు, రైతులు సోమవారం రాత్రి తొలగించారు. జాతీయ రహదారులపై అడ్డంకులను తొలగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన రెండు పిటిషన్లపై కేంద్రంతోపాటు పంజాబ్, హరియాణా రాష్ట్ర ప్రభుత్వాలకు పంజాబ్, హరియాణా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కాగా, పంజాబ్ కిసాన్ మజ్దూర్ సంఘ్ సభ్యులు దేశ రాజధానికి ట్రాక్టర్లలో బయలుదేరారు. తాము సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించకుండానే ఢిల్లీ చలో చేపడతామని తెలిపారు. చర్చల్లో కేంద్ర మంత్రుల నుంచి సానుకూల నిర్ణయాలు ఏమీ రాలేదన్నారు. భద్రత పేరుతో హరియాణా, పంజాబ్ ప్రజలను వేధిస్తున్నారని రైతు సంఘం నేతలు ఆరోపించారు. పంజాబ్, హరియాణా సరిహద్దులను అంతర్జాతీయ సరిహద్దు మాదిరి మార్చేశారని విమర్శించారు. తాము ప్రభుత్వంతో చర్చలకు ఇప్పటికీ సిద్ధమేనని తెలిపారు.ఇదిలావుంటే, సంబంధిత వర్గాలతో విస్తృత సంప్రదింపులు జరపకుండా కనీస మద్దతు ధరపై చట్టాన్ని తొందరపడి తీసుకురాలేమని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. ఎంఎస్‌పీ గ్యారంటీకి సంబంధించిన డిమాండుపై రైతులతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం తమ నిరసనను అప్రతిష్ఠ పాలు చేసే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులను హెచ్చరించారు. రెండు రౌండ్ల చర్చల్లో కర్షకుల అనేక డిమాండ్లను అంగీకరించామని, కొన్ని అంశాలపై ఇంకా ఒప్పందం కుదరలేదని కేంద్ర మంత్రి చెప్పారు. మరోవైపు, బవానా స్టేడియాన్ని తాత్కాలిక జైలుగా ఉపయోగించేందుకు కేంద్రం చేసిన ప్రతిపాదనను ఢిల్లీ ప్రభుత్వం తిరస్కరించింది. రైతులను అరెస్టు చేసి జైల్లో వేయడాన్ని అంగీకరించబోమని, ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నామని ఢిల్లీ హోం మంత్రి కైలాశ్ గెహ్లాట్ లేఖ రాశారు. ఇక, ఢిల్లీలో ప్రవేశించే సరిహద్దుల్లో భారీగా మోహరించిన పోలీసులు పలు చోట్ల బారికేడ్లను ఏర్పాటు చేశారు. ముళ్ల కంచెలను, కాంక్రీట్ శ్లాబ్‌లను, టైర్లను అడ్డుగా పెట్టారు. నగరంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. 144 సెక్షన్ విధించిన పోలీసులు అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గాజీపూర్ సరిహద్దు వద్ద కాంక్రీట్ బారికేడ్లతో రహదారిని మూసివేశారు. టిక్రీ సరిహద్దులనూ మూసివేశారు. పోలీసులు చేసిన భద్రతా ఏర్పాట్లతో ఢిల్లీలోకి దారితీసే మార్గాల్లో వందలాదిగా వాహనాలు నిలిచిపోయాయి. గాజీపూర్ వద్ద, ఢిల్లీ-నోయిడా చిల్లా సరిహద్దువద్ద భారీగా వాహనాలు నిలిచి చోదకులకు చుక్కలు కనిపించాయి. ఒక కిలోమీటరు దూరానికి గంట పట్టిందని చోదకులు వాపోయారు. గురుగ్రాం ప్రాంతంలోనూ భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దిల్లీ నుంచి ఘాజీపూర్ మీదుగా బరేలీ, మేరఠ్, ముజఫర్‌నగర్, రిషికేశ్, దేహ్రాదూన్, ముస్సోరి, మురాదాబాద్, నైనితాల్ వెళ్లా మార్గాల్లో వాహనాలు నెమ్మదిగా నడిచాయి. రైతుల ఆందోళన నేపథ్యంలో ఎర్రకోటను సోమవారం రాత్రి నుంచే మూసి ఉంచినట్లు పురావస్తుశాఖ అధికారి ఒకరు తెలిపారు. మధ్య దిల్లీలో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. పార్లమెంటుకు భద్రతను పెంచారు. దిల్లీలో 9 మెట్రో స్టేషన్ల గేట్లను అధికారులు మూసి వేశారు.

## బీఆర్ఎస్‌కు కటీఫ్?..మజ్లిస్ దోస్తీ కాంగ్రెస్ తోనే!




హైదరాబాద్,ఆల్ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తేహదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) అలియాస్ మజ్లిస్.. హైదరాబాద్ పాత బస్తీలో తిరుగులేని ఆధిపత్యం ఉన్న ఈ పార్టీ రాజకీయాల గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. బీజేపీ వ్యతిరేకతే ఈ పార్టీ విధానం అని చెప్పవచ్చు. అయితే ఆ ముసుగులో బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకు జాతీయ స్థాయిలో విస్తరణ పేరుతో ముస్లిం జనాభా అధికంగా ఉండే నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీకి నిలబెడుతోంది.అయితే మొత్తంగా ఈ పార్టీ పాత బస్తీలో తన పట్టును నిలుపుకోవడానికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ తెలంగాణలో ఒవైసీ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులూ ఆ పార్టీకే మద్దతుగా నిలిచారు. బీఆర్ఎస్ లేకుండా అధినేత కూడా అప్పట్లో ఎలాంటి దాపరికం మజ్లిస్, బీఆర్ఎస్ లు మిత్రులు అని కూడా చెప్పారు. కానీ మజ్లిస్ లక్ష్యం వేరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచీ కూడా మజ్లిస్ అధికారంలో ఉన్న పార్టీతోనే దోస్తానా చేసింది. ఉమ్మడి రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ (బీఆర్ఎస్) తో మజ్లిస్ పార్టీ దోస్తీ కొనసాగుతోంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం కూడా ఒవైసీ ఆయనతో భాయీ భాయీ బంధం నెరిపారు. మజ్లిస్ పార్టీ ఏం చేసినా పాతబస్తీలో తన పట్టు నిలుపుకోవడమే లక్ష్యంగా చేస్తుందని పరిశీలకుల విశ్లేషణ. అవును కాంగ్రెస్ రాష్ట్ర పగ్గాలు రేవంత్ చేపట్టిన తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ జోరు స్పీడుకుంది. అధికారం కారు నుంచి హస్తానికి ట్రాన్స్ ఫర్ అవుతుందన్న విశ్లేషణలూ వెల్లువెత్తాయి. దీంతో మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ బీఆర్ఎస్ కు దూరం జరిగే ప్రయత్నాలు ప్రారంభించారని అప్పట్లోనే రాజకీయవర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.ఆ ప్రచారం వాస్తవమేనని ఇప్పుడు నిస్సందేహంగా తేలిపోయింది. ఔను రేవంత్ సర్కార్ మేడిగడ్డ సందర్శనకు ఇచ్చిన పిలుపునకు మజ్లిస్ స్పందించారు. మేడిగడ్డ సందర్శనకు కాంగ్రెస్ తో పాటు మజ్లిస్ ఎమ్మెల్యేలు సైతం వెళ్లారు. అయితే రేవంత్ సర్కార్ మేడిగడ్డ సందర్శనకు రావాల్సిందిగా కోరినా బీఆర్ఎస్, బీజేపీలు స్పందించలేదు. ఈ రాష్ట్రంలో ఎవరెవరు ఇప్పుడు మిత్రులు, ఎవరెవరు ఇప్పుడు మిత్రులు కాదు అన్నది విస్పష్టంగా తేలిపోయిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తొలి నుంచీ అంటే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచీ కూడా బీఆర్ఎస్ బీజేపీకి బీ టీమ్ అన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. మద్యం కుంభకోణం కేసు విషయంలో కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుమార్తె, బీఆర్ఎస్ కల్వకుంట్ల కవితకు లభించిన, ఇప్పటికీ లభిస్తున్న వెసులు బాట్లను ఇందుకు ఉదాహరణగా ఎమ్మెల్సీ చెప్పుకోడానికి కాంగ్రెస్ ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ అవినీతికి బ్రాండ్ అన్న ఆరోపణలను సైతం ఎప్పటి నుంచో కాంగ్రెస్ చేస్తోంది.అయితే బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం ఈ విషయంలో మజ్లిస్ జోక్యం చే సుకోలేదు. కాళేశ్వరం అవినీతిపై కానీ, మేడిగడ్డ కుంగుబాటుపై కానీ మజ్లిస్ బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా స్పందించలేదు. కానీ ఎప్పుడైతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందో ఆ వెంటనే మజ్లిస్ ఆ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ సందర్శనకు వెళ్లింది. దీంతోనే మజ్లిస్ ఇప్పుడు ఎవరికి మిత్రపక్షంగా ఉందో తేటతెల్లమైపోయింది. అసలు రేవంత్ సర్కార్ మేడిగడ్డ సందర్శన కార్యక్రమం పెట్టుకున్నదే బీఆర్ఎస్ కు, కేసీఆర్ కు వ్యతిరేకంగా . అలాంటి మేడిగడ్డ సందర్శనకు మజ్లిస్ వెళ్లడం అంటే తాము కాంగ్రెస్ వైపు ఉన్నామని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కుండబద్దలు కొట్టేసినట్లే. అయితే మజ్లిస్ బీఆర్ఎస్ కు జరగడం ఏమీ ఆశ్చర్యకర పరిణామం కాదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. నిజానికి మజ్లిస్ మిత్రపక్షం గా కనిపించింది మేడిగడ్డ సందర్శనకు హాజరైన కాంగ్రెస్ కావడంతో తేలిపోయినా.. వాస్తవానికి మజ్లిస్ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే పార్టీకే మిత్రపక్షంగా ఉంటుందని, అలాగే అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా తన రాజకీయ అవసరాల కోసమే మజ్లిస్ ను చేరదని అంటున్నారు.ఇంకా స్పష్టంగా చెప్పాలంటే.. పాత బస్తీలో తన పట్టు నిలుపుకోవాలంటే మజ్లిస్ కు రాష్ట్రంలో అధికార పార్టీ అండ అవసరం. అలాగే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలంటే.. జంపింగుల భయం లేకుండా ధీమాగా పాలన సాగాలంటే.. మజ్లిస్ వారికి మద్దతుగా నిలవడం కావాలి. అందుకే పరస్పర ప్రయోజనాల పరిరక్షణలో భాగమే మజ్లిస్, కాంగ్రెస్ దోస్తానా అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## లోక్‌సభ ఎన్నికల కోసం 38 కమిటీలు ఏర్పాటు చేసిన బీజేపీ




హైదరాబాద్, రోనున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 10కిపైగా ఎంపీ స్థానాలను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ అందుకోసం 38 కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రత్యేకంగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించి ఈ కమిటీలను వేసింది. తెలంగాణలోని అన్ని ఎంపీ స్థానాలు గెలవడమే తమ లక్ష్యమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటు శాతాన్ని మరింత పెంచుకునేందుకు రాష్ట్ర పార్టీ పక్కా ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా సభలు, సమావేశాలు, రోడ్ షోలు, ప్రజాహిత యాత్రలు, విజయ సంకల్ప యాత్రలు ప్లాన్ చేసింది. తాజాగా నియమించిన 38 ఎన్నికల కమిటీలు రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం, సభలు సమావేశాలు, మేనిఫెస్టో, ఛార్జిషీట్ తదితర విధులను నిర్వహించనున్నాయి.పార్టీ తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నియమితులయ్యారు. ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ కమిటీకి కో కన్వీనర్లుగా ఏపిఎస్‌రెడ్డి, గరికపాటి, రామచందర్‌రావులను నియమించారు. మరోవైపు ఎన్నికల కార్యాలయం ప్రముఖ్‌గా రంగారెడ్డి, సహ ప్రముఖ్‌గా మాధవి నియమితులయ్యారు.ఎన్నికల మేనిఫెస్టో కమిటీ ప్రముఖ్‌గా ఎంపీ లక్ష్మణ్‌కు మరో బాధ్యతను అప్పగించిన అధిష్టానం, పార్టీ చార్జిషీట్ కమిటీ ప్రముఖ్‌గా సీనియర్ నాయకుడు మురళీధర్‌రావుకు బాధ్యతలు అప్పగించింది. మీడియా కమిటీ ప్రముఖ్‌గా కృష్ణ సాగర్‌రావు, మీడియా రిలేషన్స్ కమిటీ ప్రముఖీగా ప్రకాష్‌రెడ్డి, సోషల్ మీడియా కమిటీకి పోరెడ్డి కిషోర్‌రెడ్డి, ఎన్నికల కమిషన్, లీగల్ ఇష్యూస్ కమిటీ ప్రముఖ్ ఆంథోసి రెడ్డిని నియమించింది.

## అమర జవాన్లకు ప్రధాని నివాళులు..

న్యూఢిల్లీ,పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ నివాళులర్పించారు. దేశం కోసం వారు చేసిన సేవలు, త్యాగం ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. పుల్వామాలో అమరులైన వీరులకు నివాళులు అర్పిస్తున్నాను అని సోషల్ మీడియా ప్లాట్‌ఫారం ట్విట్టర్ (ఎక్స్)లో ప్రధాని మోడీ తెలిపారు.ఇక, జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఉగ్రదాడి జరిగి ఇవాళ్టికి ఐదేళ్లు పూర్తి అయ్యాయి. కాగా, పుల్వామా ఉగ్రదాడి 2019, ఫిబ్రవరి 14న జరిగింది. భారతదేశంపై జరిగిన భారీ తీవ్రవాద దాడుల్లో ఇది కూడా ఒకటి.. ఆ చీకటి రోజున ఉగ్రవాదులు 200 కిలోల పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేసిన దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవానులు మరణించారు. ఈ ఘటనలో మరో 35 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## ఇచ్చిన హామీలు ఎప్పుడు పూర్తి చేస్తారు...



హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ఏడాదికి రూ.1.36 లక్షల కోట్లు అవసరమని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌పై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. భారాస పదేళ్ల పాలనలో ఆర్థిక అభివృద్ధి జరిగిందంటూ గణాంకాలను చదివి వినిపించారు.''కేసీఆర్ పాలనతో తెలంగాణలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరిట 13 హామీలు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, యువత, రైతు, మహిళా డిక్లరేషన్లు ప్రకటించారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు లెక్కిస్తే 420 ఉన్నాయి. ఆరు గ్యారంటీల అమలకు ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ సరిపోదు. రుణమాఫీ సహా ప్రకటించిన డిక్లరేషన్లకు అయ్యే వ్యయం దీనికి అదనం. డిసెంబర్ 9న రైతు రుణాలను మాఫీ చేస్తామన్నారు.. అదే మేం అడుగుతున్నాం.నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. 119 నియోజకవర్గాల్లో 4.16లక్షల ఇళ్లకు రూ.24వేల కోట్లు అవసరం. బడ్జెట్‌లో కేవలం రూ.7వేల కోట్లే కేటాయించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామన్నారు. ఇంటిలో ఒక్కరికే ఇచ్చినా రూ.20వేల కోట్లు కావాలి. ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. రైతు రుణమాఫీ ఏవిధంగా.. ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి.

### బాధ్యులపై చర్యలు తీసుకోండి..

కాళేశ్వరం ద్వారా కొత్త ఆయకట్టుతో పాటు స్థిరీకరణ జరిగింది. ఆ ప్రాజెక్టు విషయంలో గోరంతను కొండంత చేసి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దు. కాళేశ్వరంతో అనేక రిజర్వాయర్లు వచ్చాయి.. నీటి నిల్వ సామర్థ్యం పెంచుకున్నాం. ఈ ప్రాజెక్టులో బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు, కెనాళ్లు, సబ్‌స్టేషన్లు ఉన్నాయి. దీనిలో ఒక భాగమైన మేడిగడ్డలో కేవలం 2, 3 పిల్లర్లు కుంగిపోయాయి. ఈ అంశంలో బాధ్యులపై చర్యలు తీసుకోండి.. మాకు అభ్యంతరం లేదు'' అని కడియం శ్రీహరి అన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ ప్రధాని మనవడు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి మరో జలక్ తగిలింది. ఆ పార్టీకి విభాకర్ శాస్త్రి రాజీనామా చేశారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మనువ డే విభాకర్ శాస్త్రి. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు మల్లిఖార్జున్ ఖర్గేకు పంపిన లేఖలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో చోటు దక్కకపోవడంతో విభాకర్ శాస్త్రి మనస్తాపంతో ఉన్నట్లు చూపుతున్నారు. ఆయన ఇవాళే బీజేపీలో చేరుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.




## సంపాదకీయం

గురువారం 15-02-2024

# ఎన్నికల వేళ తెలుగు రాష్ట్రాలలో పెరిగిన ఉత్కంఠ

2024 సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరవడుతోంది. సర్వే రిపోర్టులతో దేశమంతా ఎన్నికల వేడి రాజుకుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఉత్కంఠ మొదలైంది. టీడీపీ, టీఆర్ఎస్ లు అతి పెద్ద పరీక్షను ఎదుర్కోబోతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లోని అధికార వైసీపీకి కూడా ఈ ఎన్నికలు పరీక్ష పెడుతున్నాయి. పవన్ కల్యాణ్ జనసేన భవిష్యత్‌ని తేల్చే ఎన్నికలు ఇవి. అయితే గాలి ఎటువైపు వీస్తుందో ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. అయితే, తమ పరిస్థితికి అనుగుణంగా ఎ.పి లో పార్టీల ఎంఎల్ఎలు, ఎంపిలు అటూ ఇటూ మారుతున్నారు. ఇక తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ మనుగడకు వచ్చే లోక్‌సభ ఎన్నికలు పరీక్ష పెడుతున్నాయి. ఎన్నికల నాటికి ఆ పార్టీలో ఎంతమంది ఎమ్మెల్యేలు..సిట్టింగ్ ఎంపీలు ఉంటారో తెలియని పరిస్థితి.. ఇప్పటికైతే బిఆర్ఎస్ నుంచి ఒక ఎంపీ కాంగ్రెస్ గూటికి చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలవడం రేవంత్‌కు అనివార్యం. కాబట్టి బీఆర్ఎస్‌ను ఎంత బలహీన పరిస్తే ఆయన పని అంత సులువు అవుతుంది. ఇక ఏపి లో చంద్రబాబు నాయుడుకు ఇది అతి పెద్ద పరీక్షా సమయం. మరోవైపు జగన్ అధికారాన్ని కాపాడుకునేందుకు పథక రచన చేస్తున్నారు. బాబు 'రా కదిలిరా' అంటే.. జగన్ 'సిద్ధం' అంటూ యుద్ధం ప్రకటిస్తున్నారు. చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్న పవన్ కళ్యాణ్ శాసనసభలోకి ప్రవేశించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. మరోవైపు, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హస్తం పార్టీని తిరిగి పట్టాలెక్కించే ప్రయత్నంలో ఉన్నారు. అందుకు వచ్చే ఎన్నికలు ఆమెకు మంచి అవకాశం. ఇప్పటికిప్పుడు సీట్లు గెలవకపోయినా కాంగ్రెస్ ఉనికిని ప్రదర్శిస్తే షర్మిల సక్సెస్ అయినట్టే. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ ఏ పార్టీ వైపు వెళ్లాలో ఆచి తూచి అడుగులు వేస్తోంది. నిన్నటి మొన్నటి వరకు వైసీపీకి 24 ఎంపీ సీట్లు ఖాయం అనే పరిస్థితి ఉంది. కానీ ఇప్పుడు టీడీపీ వైపు మొగ్గు చూపిస్తున్నాయి సర్వేలు. దాంతో బీజేపీ కూడా టీడీపీ తో పొత్తు పట్ల విముఖ ప్రదర్శించే పరిస్థితిలో లేదు. అంతేగాక బీజెపితో జట్టు కట్టడం కోసం చంద్రబాబు నాయుడు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. 2018లో ఎన్నికల ముందు ప్రత్యేక హోదా బదులు ప్యాకేజీకి ఒప్పుకున్న చంద్రబాబు చివరలో బిజెపి నుంచి విడిపోవడం, ఎన్‌డిఎ నుంచి బయటకు రావడం కేవలం ప్రజలను నమ్మించడానికేనని అందరికీ తెలుసు. అయినా టీడీపీ బాబు ఘోరంగా ఓడిపోయింది. ఎన్నికల తరువాత బిజెపిని ఏనాడూ విమర్శించలేదు. ఇక పవన్ కళ్యాణ్ కూడా ఇలాగే వ్యవహరించారు. మోడీ, అమిత్‌షాల పట్ల అనుక్షణం విధేయత ప్రకటిస్తూ వచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి జగన్ తనపై ఉన్న కేసుల రీత్యా మోడీకి వంత పాడటం మినహా చేసేదేమీ లేదు. మోడీ సర్కార్‌కు పూర్తి మెజార్టీ వుండటంతో జగన్‌కు ఈ పరిస్థితి వచ్చింది. ఏదేమైనా ఏపీ లోని మూడు ప్రాంతీయ పార్టీలూ తమ ప్రయెజనాల కోసం మోడీ జపం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను ఘోరంగా దెబ్బతీస్తు న్నారనేది ప్రజలకు తెలియంది కాదు. నిజానికి బీజేపీ గత ఎన్నికల్లో 0.96 శాతం అంటే ఒక శాతం కన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. అలాంటి బిజెపితో పొత్తు ఎందుకంటే అది కేంద్రంలో అధికారంలో ఉండటమే. ఎవరెటు పోయినా బీజేపీకి తన ప్రయోజనాలే ముఖ్యం. మరి కొద్ది రోజుల్లో కమలం పార్టీ తన వైఖరిని స్పష్టం చేయవచ్చు. అప్పుడు కానీ ఏపీ రాజకీయాలు మరింత రంజుగా మారతాయి. తెలంగాణలోనూ కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య బీజేపీ తన లాభాన్ని వెతుక్కుంటోంది. బీఆర్ఎస్ ఇప్పుడు బీజేపీని పల్లెత్తు మాట అనటంలేదు.కేవలం కాంగ్రెస్ పార్టీనే లక్ష్యంగా చేసుకుంది. ఇక సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి బిఆర్ఎస్ నే టార్గెట్ చేశారు.ముందు బీఆర్ఎస్‌ని బలహీన పరచి ..ఎన్నికల నాటికి బీజేపీపై దాడిని తీవ్రం చేయాలనేది కాంగ్రెస్ ఎత్తుగడగా కనిపిస్తోంది.

# కమలం వైపు ఆకర్ష్..లాభమేనా?



న్యూఢిల్లీ,మహా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అశోక్ చవాన్ కాంగ్రెస్‌కి రాజీనామా చేయడంలో వ్యక్తిగత ప్రయోజనం ఉండవచ్చు. ఆయన రాజీనామా వల్ల ఆ పార్టీకీ, ప్రతిపక్ష ఇండియా కూటమికి ఎదురుదెబ్బంటూ వార్తలు వచ్చాయి.సాధారణంగా పెద్ద నాయకుడు పార్టీ మారినప్పుడల్లా ఇలాంటి కథనాలు వెలువడుతుంటాయి. కానీ,అశోక్ చవాన్ విషయం ఆలోచిస్తే ఆయన మహారాష్ట్రలో పార్టీకి చేసింది పెద్దగా ఏమి లేదు.పైగా, ఆయన హయాంలో చోటు చేసుకున్న ఆదర్శ హౌసింగ్ సొసైటీ కుంభకోణం వల్ల ఆనాటి మహారాష్ట్ర ప్రభుత్వంపైనా, కాంగ్రెస్ పార్టీపైనా మచ్చ పడింది.ఆయన మాదిరిగా మహారాష్ట్రలో మరో ఇద్దరు ప్రముఖ నాయకులు కాంగ్రెస్ పార్టీ నుంచి వైదొలగి అజిత్ పార్టీలోనూ, ఏకనాథ్ షిండే పార్టీలోనూ చేరనున్నట్టు వార్తలు వచ్చాయి. అశోక్ చవాన్ కూడా బీజేపీలో చేరుతారనీ,రాజ్యసభ టికెట్ ఇస్తామన్న పిలుపుతోనే ఆయన కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారంటూ వార్తలు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. కనుక, ఎన్నికల లోపు ఇంకా చాలా మంది గోడదూకే అవకాశం ఉందంటున్నారు.వీరందరూ వ్యక్తిగత అజెండాతో ఎంతో కాలంగా తమను ఆదరించిన పార్టీకి గుడ్‌బై చెబు తున్నారు. వీరిలో మిలింద్ దేవరా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడన్న పేరుంది. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే మాదిరి పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఆర్ఎల్‌డి ఇండియా కూటమి నుంచి వై దొలగి ఎన్‌డిఎ చేరారు. ఆర్ఎల్‌డి వ్యవస్థాపకుడు అజిత్ సింగ్ బీజేపీకి వ్యతిరేక పంథాని అనుసరించేవారు. అజిత్ సింగ్ తండ్రి చరణ్ సింగ్‌కి కేంద్రం ఇటీవల భారత రత్న పురస్కారాన్ని ప్రకటించింది.ఆ ప్రకటన, ఆర్ఎల్‌డి వైదొలగడం రెండూ ఒకేసారి జరగడం వల్ల చరణ్‌సింగ్‌కి భారత రత్న ఇవ్వడం వల్లనే ఆ పార్టీ ఎన్‌డిఏలో చేరినట్టు ప్రచారం జరిగింది. కొత్తగా చేరిన వారితో బీజేపీ,దాని నేతృత్వం లోని ఎన్‌డి ఏ కూటమి బరువు ఎక్కువైన పడవలా తయారవుతుందేమోనన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే, అయోధ్యలో రామాలయం నిర్మాణం సాకారం కావడంతో బీజేపీ పట్ల జనాకర్షణ ఉందన్న మాట వినిపిస్తోంది. గతంలో ఇందిరాగాంధీ బంగ్లాదేశ్ యుద్ధంలో విజయం సాధించినప్పుడు, ఆమెహత్యా నంతరం జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌లోకి ఇదే మాదిరిగా భారీ ఎత్తున చేరికలు ఉండేవి.కాంగ్రెస్ ముక్త భారత్ (కాంగ్రెస్ లేని భారత్) బీజేపీ లక్ష్యమే కావచ్చు, కానీ, కాంగ్రెస్ నుంచి వచ్చిన వారినే చేర్చుకోవడం వల్ల ఆ పార్టీకి ప్రయోజనకరమన్న ప్రశ్న తలెత్తుతోంది. మధ్యప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కూడా బీజేపీ లోకి క్యూ కట్టేందుకు పలువురు ప్రతిపక్ష ఎంపీలు సిద్ధంగా ఉన్నారు. వీరందరికీ గేట్లు తెరిస్తే, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ల పంపిణీ క్లిష్టతరమవుతుంది.

ఇప్పటికే, చాలా చోట్ల ఒకే స్థానానికి ఇద్దరు,ముగ్గురు పోటీ పడుతున్నారు. రాజకీయాల్లో ఏ పార్టీ అధికారం లో ఉంటే, అందులో చేరడం విశేషమూ కాదు, అసాధా రణమూ కాదు.ఎవరిని పడితే వారిని ఆహ్వానించి అక్కున చేర్చుకోవడం వల్ల వచ్చే ప్రమాదాన్ని బీజేపీ పెద్దలు గుర్తించాలి.చేర్చుకునేటప్పుడు బాగానే ఉంటుంది. అది బలుపు కాదు, వాపు అన్న సంగతి తర్వాత తెలుస్తుంది. బీజేపీలో ఇప్పటికే కాంగ్రెస్ సంస్కృతి వచ్చి చేరిందన్న మాటలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో అప్రదిష్టపాలైన వారిని చేర్చుకోవడం వల్ల తమ పార్టీకి ఏమంత మేలో కమలనాథులు ఆలోచించాలి. పార్టీ అగ్రనాయకుల దృష్టికి రాకుండానే, రాష్ట్ర స్థాయిలో ఈ చేరికలు, కూడికలు జరుగుతున్నట్టు భోగట్టా. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తరచూ ప్రకటించే 370 స్థానాల సంఖ్యను చేరుకునే అవకాశం ఇప్పటికే ఉంది కనుక, ఇక పైన ఆయారామ్‌లకు పార్టీ తీర్థం ఇచ్చే ముందు అన్ని కోణాల్లో ఆలోచించడం అత్యవసరం. ఎన్నికల షెడ్యూ లు ప్రకటన తర్వాత ఈ చేరికలు ఇంకా భారీ ఎత్తున ఉండవచ్చు. చాలా రాష్ట్రాల్లో అధికార పార్టీల్లోకి ప్రతి పక్షాల ఎమ్మెల్యేలు చేరడం కోసం తెరవెనక సంప్రదింపు లు జరుపుతున్నారు.అయితే గతంలో మాదిరిగా వేటు పడుతుందేమోనని కొందరు వెనక్కి తగ్గుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ పరిస్థితి ఉంది. రాజ్యసభ ఎన్నికలకు బలాన్ని సమకూర్చుకోవడానికి ఫిరాయింపు లను అధికారంలో ఉన్న పార్టీలు ప్రోత్సహిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికలకు ఎమ్మెల్యేల సంఖ్య సరిపోని రాష్ట్రాల్లోనే అధికార పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహి స్తున్నాయి. మహారాష్ట్రలో మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ రాజ్యసభ టిక్కెట్టు ఆశించి పార్టీ ఫిరాయించినట్టు సమాచారం. అలాగే ఎన్సీపీ అజిత్, ఉద్ధవ్ వర్గాలు కూడా ఈ మాదిరిగా ప్రత్యర్థి శిబిరాల నుంచి ఎమ్మెల్యేల ను ఆకర్షించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నాయి.

# ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

విజయవాడ,టిడిపి,జనసేనతో పాటు కమ్యూనిస్టులు కూడా అమరావతి, విశాఖ స్టీల్ తదితర విషయాలపై గట్టిగానే పోరాడుతున్నారు. ఈ విషయంలో కమ్యూనిస్టులు కొంత వీధిపోరాటాలు ఎక్కువగానే చేస్తున్నారు. ఉద్యోగుల ఆందోళనలకు మద్దతు ఇవ్వటం ద్వారా సమస్యను బాగాను హైలెట్ చేశారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అరచేతిలో వైకుంఠం చూపించారు. వాస్తవం లో ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైంది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్య ప్రజల ఆదాయాలు కుంచించుకుపోతున్నాయి. ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రతరమవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించటంలో జన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని సిపిఎం నేత వి.శ్రీనివాసరావు ఘాటుగా విమర్శించారు. అప్పులు చేయడం పంచి పెట్టడం అన్నరీతిలో పాలన సాగుతోంది. దీనిని ఎప్పిటికప్పుడు కమ్యూనిస్టులు గట్టిగానే విమర్శిస్తున్నాయి. అమరావతి, విశాఖ స్టీల్, కృష్ణపట్నం తదితర అంశాల్లో పెరుగుతున్న ప్రజా ఉద్యమాలు ఆటంకంగా మారుతున్నాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం, విద్యార్థుల పోరాటాలు, మహిళ, దళిత, ఆదివాసీ ఉద్యమాలు, తాజా ఉద్యోగుల ఆందోళన ఇవన్నీ అందులో భాగమే. సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం ఆందోళనలను నిరంకుశంగా అణచటానికి ప్రయత్నం చేస్తున్నదని వి.శ్రీనివాసరావు అన్నారు. నష్టపోతున్న శ్రామికుల పక్షాన కమ్యూనిస్టులు, కార్మిక తదితర ప్రజాతంత్ర సంఘాలు నిలబడి పోరాడుతున్నాయి. ప్రజల మధ్య ఐక్యత కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారు. వారిని చీల్చి ప్రజా ఉద్యమాలను బలహీన పర్చటానికి పాలక వర్గాలు కుట్ర పన్నుతున్నాయి. అందుకు కులం, మతం, ప్రాంతం లాంటి ఏ ఒక్క అంశాన్ని అధికార పార్టీ వదలటం లేదు. ఎపి కూడా అదానీ, అంబానీలకు స్థావరంగా మారింది. గంగవరం పోర్టు వాటాను అదానీపరం చేయటం తాజా ఉదాహరణ. కృష్ణపట్నం ఓడరేవు ఎప్పుడో వారి పరమైపోయింది. ఈ విధానాలను వ్యతిరేకిస్తున్న కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని, ప్రతిష్టను దెబ్బ తీయడానికి ఎర్రజెండాలపై అక్కసు వెళ్లగక్కారని సిపిఎం ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస రావు మండిపడ్డారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి చేసిన ద్రోహం చేసినా పోరాడలేని అశక్తతలో సిఎం జగన్ ఉన్నారని మండిపడ్డారు. అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం వారికి లొంగిపోయి మతోన్మాద రాజకీయాలకు వంత పాడుతున్నాయి. బిజెపి మతోన్మాద ఎజెండాకు ప్రజా ఉద్యమాలు చెక్ పెడుతున్నాయి. 2019 ఎన్నికల తరువాత బిజెపి ద్రోహంపై ఒక్కసారి కూడా నోరు విప్పని జగన్ మోహన్ రెడ్డి పనిగట్టుకొని కమ్యూనిస్టులపై దాడికి దిగారని అన్నారు. నాడు చంద్రబాబు నాయుడు ప్రపంచబ్యాంకు సంస్కరణలు తీసుకువస్తే, అవే విధానాలను మరో పేరుతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఇద్దరూ తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారని చెప్పారు. రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేసినా ప్రశ్నించటం లేదు. అందుకే కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేస్తుంటే అధికార వైసిపికి కంటగింపుగా వుందన్నారు.

# దక్షిణాదిపై ఆర్థిక వివక్ష?



దక్షిణ రాష్ట్రాల నిధులు, ఉత్తర రాష్ట్రాల నిధులనే పురస్కరించుకొని దేశంలో వున్నట్లు ఒక ముఖ్యమైన చర్చ మొదలైంది. దక్షిణాది అభివృద్ధి, సంపదలు, పన్నుల వసూళ్ళు ఉత్తరాది కన్నా ఎక్కువ కాగా, వాటిని వెనుకబడిన ఉత్తరాది రాష్ట్రాలకు మళ్ళిస్తున్నారని, కేంద్ర నిధుల కేటాయింపులో దక్షిణాది పట్ల వివక్ష చూపుతున్నారనేది ఈ చర్చలోని ప్రధానాంశం. నిజానికి ఈ ఫిర్యాదు కొంత కాలం నుంచి వున్నా, దీనిని అజెండా చేసుకొంటూ కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరా, కేరళ ముఖ్యమంత్రి స్వయంగా ఢిల్లీలో గత కొద్ది రోజుల క్రితం నిరసన కార్యక్రమాలు నిర్వహించడం, తమిళనాడు ప్రభుత్వం అదే విషయమై గొంతెత్తడం, ఆప్ ప్రభుత్వం సంఘీభావం తెలపడం దీన్నంతటినీ ప్రధాని మోడీ పార్లమెంటులో విమర్శించడంతో ఈ అంశానికి సరికొత్త ప్రాధాన్యత ఏర్పడింది. తాము అధికారంలో వున్నప్పుడు బిఆర్ఎస్ ఈ వివక్షను పదే పదే ఎత్తి చూపుతుండటం తెలిసిందే.ఉత్తరాది దక్షిణ కన్నా రాష్ట్రాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందడం అనేది స్వయంగా కేంద్ర సంస్థలతో పాటు అనేక స్వతంత్ర అధ్యయనాలు ఎప్పటి నుంచో చెప్తున్న విషయం. ఈ ఉత్తర రాష్ట్రాల కన్నా దక్షిణ రాష్ట్రాల పాలనకు కారణాలు సాగడం. శాంతి భద్రతలు మెరుగుగా వుండి అభివృద్ధికి సానుకూల వాతావరణం ఏర్పడటం. సామాజిక సంక్షేమ రంగంలో అవసరమైన చర్యలు. మంచి అభివృద్ధి మూలంగా ఆర్థిక రంగం స్థిరంగా వుండి పన్నుల వసూళ్ళు కోసం పెరుగుతుండటం. విద్య, వైద్య పురోగమనాలు, ప్రాథమిక సౌకర్యాల విస్తరణలు. ప్రజల చైతన్యం మూలంగా జనాభా నియంత్రణలో ఉండటం. ఒక్క మాటలో చెప్పాలంటే ఉత్తరాది పరిస్థితులు మొత్తంగానే ఇందుకు విరుద్ధం. అందువల్లనే ఇంతకుముందు కేంద్ర ప్రణాళికా సంఘం 'బిమారూ' (వ్యాధిగ్రస్థ) రాష్ట్రాలుగా ప్రకటించినవన్నీ ఉత్తరాదివే అయ్యాయి. ఆ పరిస్థితి కొన్ని దశాబ్దాలు గడిచినా మారలేదు.వెనుకబడిన రాష్ట్రాలను ఆదుకోవాలనే పేరుతో కేంద్రం ఈ దశాబ్దాల పొడవునా పెద్ద ఎత్తున అదనపు నిధులు కేటాయిస్తున్నా, దక్షిణాది నుంచి పన్నుల ఆదాయం మళ్ళిస్తున్నా, దక్షిణ రాష్ట్రాలకు కేంద్ర నిధులను అక్కడి అభివృద్ధి నత్తనడకనే సాగుతోంది.ఇందుకు కారణం పైన అనుకొన్నట్లు ఎడతెగని అసమర్ధ పాలన. ఒక దేశంలో వెనుకబడిన రాష్ట్రాలను ముందుకు తెచ్చేందుకు అభివృద్ధి చెందిన రాష్ట్రాల నుంచి కొన్ని నిధులను మళ్లించడం అవసరమనే సూత్రీకరణలో యథాతథంగా ఆక్షేపించవలసిందేమీ లేదు. కనుకనే ఈ మళ్ళింపులకు దక్షిణ రాష్ట్రాలు చాలా కాలం మౌనంగా అంగీకారం తెలిపాయి. కానీ, ఈ సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన పాలనతో ముందడుగు వేసేందుకు బదులు ఉత్తరదేశం అదే ఊబిలో కొనసాగుతున్నది. కనీసం కేంద్రమైనా గత కాంగ్రెస్ పాలనలో గాని, తర్వాత బిజెపి హయాంలో గాని పరిస్థితి చక్కదిద్దడంలో విఫలమైంది.అందువల్ల దక్షిణాది రాష్ట్రాలపై భారం ఒక అంతులేని కథగా మారింది. తాము సమర్థంగా పాలించుకొని అభివృద్ధి చెందడానికి "ఈ శిక్షను" ఇంకా ఎంత కాలం అనుభవించాలి? అసలు ఎందుకు అనుభవించాలి? అన్న ప్రశ్నలు దక్షిణాదిన కొంత కాలం క్రితం వరకు మందకొడిగా ఉండి, ఇటీవల ఉచ్ఛ స్వరంలో వినవస్తున్నాయి. గతంలో తెలంగాణ, తమిళనాడు, కేరళ పలు మార్లు ఈ అంశం లేవనెత్తాయి. నిధుల మళ్ళింపు ఒకటి కాగా, నిధుల కేంద్రంలో కోత రెండవది. ఒక దశలోనైతే తమిళనాడు, దక్షిణ రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం ఏర్పాటు చేసి, దక్షిణాది యూనియన్ స్థాపనకు ప్రయత్నించింది. ఇటీవల కర్ణాటకలో కాంగ్రెస్ అధికారానికి రావడంతో వారు కూడా ఈ వాదనలతో స్వరం కలుపుతున్నారు. తెలంగాణలో కొత్తగా గెలిచిన కాంగ్రెస్ కూడా ముందుకు రాగలదేమో చూడాలి.ఢిల్లీలో నిరసన కార్యక్రమాల సందర్భంగా సిద్దరామయ్య, విజయన్‌లు మాట్లాడుతూ, తాము ఉత్తర, దక్షిణ దేశాల మధ్య విభేదాలు సృష్టించేందుకు గాని, విభజనకు ప్రయత్నించడం లేదని, తమ పట్ల వివక్ష చూపవద్దని కోరుతున్నామని స్పష్టం చేశారు.అయితే, ముఖ్యమంత్రి స్థాయి వారు తమ రాజధానిలో ఈ మేరకు ప్రకటనలు చేయడానికి, స్వయంగా దేశానికి వెళ్ళి జంతర్మంతర్ వంటి నిరసనల కేంద్రం వద్ద ఆందోళన చేయడానికి గల తేడా ఏమిటో చెప్పనక్కర్లేదు.ఈ విధంగా దీర్ఘకాలంగా నలుగుతున్న ఈ ప్రశ్నకు సహేతుకమైన సమాధానాన్ని కనుగొనడంలో పరిస్థితి సరిదిద్దవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై వుంటుంది. కానీ అందుకు బదులు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, తాము ఆర్థిక సంఘం అధికారులను తు.చ తప్పకుండ అమలు చేస్తున్నామని సర్ది చెప్పబోయారు. కానీ వాస్తవం ఏమంటే, ఆర్థిక సంఘంల వెనుక కేంద్ర మంత్రాంగాలు, నిధుల బదిలీ ప్రాతిపదిక నిర్ణయాలు ఉంటాయి. లేనిదే సంపన్న రాష్ట్రాల రాబడులను కొరత రాష్ట్రాలకు దశాబ్దాల తరబడి మళ్ళించడం జరగదు. ఇది చాలదన్నట్లు కేంద్రం బుధవారం నాడు కేరళకు ఆర్థిక క్రమ శిక్షణ లేదని ఆరోపిస్తూ సుప్రీం కోర్టు ముందు ఒక పత్రం దాఖలు చేసి, అసలు ప్రశ్నలను దాటేందుకు ప్రయత్నించింది.అదే రోజున ప్రధాని మోడీ లోక్‌సభలో మరొక చతురమైన వాదన చేశారు. జాతీయ నిధులపై రాష్ట్రాలు రాజకీయం చేస్తున్నాయని అది సరి కాదని అన్నారు. "మా పన్నులు, మా నిధులు అంటున్నారు. అదేమి భాష? దేశమంతా ఒకే శరీరం. ఏ భాగం పని చేయకున్నా అంగ వైకల్యం ఏర్పడుతుంది. హిమాలయాల నీటిని, మరొక రాష్ట్రం బొగ్గును ఇతర రాష్ట్రాలకు ఇవ్వబోమంటే ఏమవుతుంది?" అంటూ ప్రశ్నించారు. ఇది స్థూలంగా వినేందుకు సమంజసంగానే తోస్తుంది. కానీ పైన చర్చించినట్లు ఉత్తరాది రాష్ట్రాలు ఎడతెగని దశాబ్దాల అసమర్థ పాలనకు దక్షిణ రాష్ట్రాలు ఎందుకు మూల్యం చెల్లించాలంటే ప్రశ్నకు ఇది సమాధానమవుతుందా? కనుక, ఈ ప్రాథమిక ప్రశ్నలకు జవాబులను ప్రాథమిక స్థాయిలోనే కొనుగొనవలసి ఉంటుంది. పులి మీద పుత్ర అన్నట్లు ఇటీవల మరొక తీవ్ర సమస్య ముందుకు వచ్చింది. జనాభాను సమర్ధంగా నియంత్రిస్తున్నందున దక్షిణాదిన జనాభా ఒక స్థాయికి పరిమితంగా ఉండగా, అటువంటి నియంత్రణ లేక ఉత్తరాది జనాభా పెరుగుతోంది.ఈ స్థితిలో లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన జరిగినపుడు జనాభా ప్రాతిపదికన దక్షిణాది స్థానాలు ఇప్పటికన్నా ఉత్తరాది స్థానాలు పెరుగుతాయి. దక్షిణాది నాయకుల భయాలకు, తీవ్ర వ్యతిరేకతలకు ఇది మరొక ముఖ్య కారణం. ఈ భయాలు తొలగించేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదు. ఒక వైపు ఇది, మరొక వైపు ఆర్థికంగా కలిసి సమస్య బాగా జటిలమవుతోంది.

## తెలంగాణలో బదిలీల పర్వం

హైదరాబాద్, తెలంగాణలో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. తాజాగా 40 మంది మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. బుధవారంలోగా బదిలీ చేసిన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ 40 మంది మున్సిపల్ కమిషనర్లు బుధవారమే కొత్త కార్యాలయంలో బాధ్యతలు తీసుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదీల ప్రక్రియ కొనసాగుతోంది. చాలా శాఖల్లోనూ అధికారులకు స్థానచలనం కలుగుతోంది. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖలోకి 395 మంది ఎంపీడీవోలను సర్కార్ వేరే చోటుకి పంపింది. అలాగే ఎక్సైజ్ శాఖలోనూ భారీగా బదిలీలు జరిగాయి.మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ బదిలీలు జరుగుతున్నాయి. ఈసీ మార్గదర్శకాలతో ప్రభుత్వం 14 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు స్థాన చలనం కల్పించింది. ఈ క్రమంలోనే తాజాగా కాంగ్రెస్ సర్కార్ 40 మంది మున్సిపల్ కమిషర్లను బదిలీ చేసింది.రానున్న రోజుల్లో మరికొన్ని శాఖల్లోనూ అధికారులకు స్థానచలనం జరిగే అవకాశాలున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఎన్నికల విధులకు అనుబంధంగా ఉండే శాఖల్లోకి అధికారులను బదిలీ చేసే

# నేరాల గుర్తింపులో సీసీకెమెరాలు కీలకం

హైదరాబాద్,శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. అందుకే వీటిని ఏర్పాటుఏ చేసేందుకు హైదరాబద్ సహా అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. ఇకపోతే హైదరాబాద్‌లో ఏర్పాటయిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం ద్వారా అన్ని జిల్లాలను అనుసంధానం చేస్తారు. అప్పుడు జిల్లాల్లో కూడా ఎప్పుడు ఏం జరిగినా ఇట్టే పసిగట్టే అవకాశం ఉంది. ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటవుతున్నాయి. అలాగే కొందరు ఔత్సాహికుల ద్వారా కూడా ఏర్పాటు చేయిస్తున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. కేసులను పసిగట్టి కూపీ లాగడంలోనూ బాగా పనికి వస్తున్నాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహి స్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదన్నారు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమెరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయని డీజీపీ తెలిపారు. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తున్నది. ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది.

## శివరాత్రికి వేయిస్తంభాల గుడి కల్యాణమండపం రెడీ

వరంగల్, హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడి ఆవరణలో నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులు దాదాపు కొలిక్కి వచ్చాయి. వచ్చే శివరాత్రి నాటికి మండపాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సమాచారం. 2005లో ప్రాచీన కల్యాణమండపాన్ని తొలగించి పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధుల విడుదలలో జాప్యం, స్థపతితో వివాదం నెలకొన్న నేపథ్యంలో ఏళ్ల తరబడి పనులు కొనసాగాయి. రెండేళ్ల కిందట కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండపాన్ని సందర్శించి తగినన్ని నిధుల విడుదలకు ఆదేశాలివ్వడంతో పనుల్లో వేగం పెరిగింది. వేయిస్తంభాల గుడికి, మండపానికి మధ్యనున్న భారీ రాతిగోడను తాజాగా కూల్చివేసి.. ఈ రెండింటినీ అనుసంధానించారు. కాకతీయుల కాలంలో శాండ్‌బాక్స్ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ కట్టడాన్ని మళ్లీ అదే రీతిలో పునర్నిర్మించారు. దీన్ని తిలకించే భాగ్యం పర్యాటకులకు త్వరలో కలగనుంది. ఇంతవరకు కల్యాణమండపానికి కేంద్ర పురావస్తు శాఖ రూ.17 కోట్ల వరకు వెచ్చించింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం మండపం పనులను పరిశీలించనున్నారు.

# కెఆర్ఎంబికి ప్రాజెక్టుల అప్పగింతపై తెలంగాణ అసెంబ్లీ తీర్మానం

హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం విధించిన షరతులను అంగీకరిస్తేనే ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)కి అప్పగించాలని, షరతులను అంగీకరించకపోతే అప్పగించేది లేదని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంతి ఉత్తమ కుమార్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. పరీవాహక ప్రాంతం, కరువు పీడిత ప్రాంతం, బేసిన్ జనాభా, సాగు చేయదగిన ప్రాంతం ఆధారంగా రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేయాలి చేయాలని, కృష్ణా వాటర్ డిస్‌పూట్ ట్రిబ్యునల్ (కెడబ్ల్యుడిటి) ప్రకారం ప్రాధాన్యతపై మొదట బేసిన్ అవసరాలు తీర్చాలని, సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) నిబంధనల ప్రకారం శ్రీశైలం నుంచి జలాలను వినియోగించుకోవడానికి అనుమతి ఇవ్వాలని, కృష్ణా బేసిన్ బయట ప్రాజెక్టులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని తరలించరాదని అసెంబ్లీ డిమాండ్ చేసింది. ఈ షరతులకు అంగీకరించకుండా కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. 'కృష్ణా నది దక్షిణ తెలంగాణా ప్రాంతాలకు నీటిపారుదల, తాగునీటి అవసరాలకు జీవనాధారం. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 811 టిఎంసిల నీటిని కేటాయించారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా గణనీయమైన నీటిపారుదల సామర్థ్యాన్ని సృష్టించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా బేసిన్ అవసరాలపై తగిన శ్రద్ధ చూపకపోవడంతో అప్పటి ప్రభుత్వం తెలంగాణకు 299 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిల నీటి భాగస్వామ్యానికి రెండు రాష్ట్రాల మధ్య తీవ్ర అన్యాయమైన నిష్పత్తికి అంగీకరించింది. ఎపి పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014 ద్వారా, రెండు రాష్ట్రాల మధ్య నీటి భాగస్వామ్యాన్ని నియంత్రించడానికి కెఆర్ఎంబి సృష్టించబడింది. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఉమ్మడి ప్రాజెక్టులు అంటే శ్రీశైలం డ్యాం, నాగార్జునసాగర్ డ్యామ్‌లను కెఆర్ఎంబి నియంత్రణకు అప్పగించాలని కూడా అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది' అంటూ తెలంగాణ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలో తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మానంపై చర్చ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కృష్ణా ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించేందుకు మీరే అంగీకారం తెలిపారని మంత్రి ఉత్తమ్, బిఆర్ఎస్ సభ్యులు హరీష్‌రావు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఈ సమయంలో సిఎం రేవంత్‌రెడ్డి కల్పించుకొని, దొంగలకు సద్ది మోసే విధానం



మంచిది కాదని బిఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సభలో కృష్ణా జలాలపై చర్చ జరుగుతుంటే విపక్షనేత కెసిఆర్ ఫామ్ హౌస్‌లో పడుకుంటారా? ఆయన నిబద్ధత ఇదేనా? అని ప్రశ్నించారు. తీర్మానానికి అనుకూలమా.. వ్యతిరేకమా..అనేది స్పష్టం చేయాలని ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీని కోరారు. హరీష్‌రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన నల్గొండ సభ వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తీర్మానం పెట్టిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ప్రాజెక్టులను కెఆర్ఎంబికు అప్పగించిందని విమర్శించారు. కృష్ణా జలాల వినియోగంపై మంత్రి ఉత్తమ్ అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు మేలు జరిగేలా గత సిఎం కెసిఆర్ వ్యవహరించారని ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్లను అపెక్స్ సమావేశంలో అడ్డుకునే అవకాశం ఉన్నా ఆ సమావేశానికి ఆయన ఉద్దేశపూర్వకంగా హాజరు కాలేదని విమర్శించారు. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని అక్రమంగా తరలించుకుపోతున్నా అడ్డు చెప్పలేదన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో జరిగిన జలదోపిడీని అడ్డుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులను ఒత్తిడికి గురిచేసి తాము చెప్పినట్లే చేయాలని గత ప్రభుత్వం వారితో తప్పులు చేయించిందని దుయ్యబట్టారు. అధికారుల్లో బిఆర్ఎస్ ఏజెంట్లు చాలామంది ఉన్నారని, వారిపై త్వరలో చర్యలు ఉంటాయని అన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ చంద్రబాబు రెండోసారి సిఎం కాకూడదని కెసిఆర్ భావించారన్నారు. జగన్‌కు రాజకీయంగా లబ్ది చేకూర్చాలనే ప్రాజెక్టుల విషయంలో మెతకవైఖరి ప్రదర్శించారని విమర్శించారు.

# అహ్లాన్ మోడీకి 65 వేల రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ,మన దేశంలోనే కాదు విదేశాల్లో కూడా ప్రధాని నరేంద్ర మోడీకి మంచి ఆదరణ ఉంది. యూఏఈలో జరుగబోయే 'అహ్లాన్ మోదీ' కార్యక్రమానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తే ఇది స్పష్టమవుతుంది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఏకంగా 65 వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఫిబ్రవరి 13న అంటే నేడు యూఏఈలో జరిగే 'అహ్లాన్ మోదీ' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఇండియన్ పీపుల్ ఫోరమ్ ప్రెసిడెంట్, 'అహ్లాన్ మోదీ' ఇనిషియేటివ్ హెడ్ జితేంద్ర వైద్య ఈ ఈవెంట్ గురించి మీడియాకు తెలిపారు. ఇది ఒక ప్రత్యేకమైన కార్యక్రమమని, ప్రవాస భారతీయుల కమ్యూనిటీ దీనికి సకల ఏర్పాట్లు చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు 65 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, అంతకుమించి జనం వస్తే, వసతి కల్పించలేమని, అందుకే రిజిస్ట్రేషన్లు ఇక నిలిపివేయాల్సి వచ్చిందని యూఏఈలోని భారత రాయబారి సంజయ్ సుధీర్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13నుంచి ప్రారంభమయ్యే తన పర్యటనలో యూఏఈ, ఖతార్‌లోని ప్రవాస భారతీయులతో భేటీ కానున్నారు. యూఏఈలో నిర్మితమైన హిందూ దేవాలయాన్ని 14న ప్రధాని ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐదు వేల మంది భక్తులు హాజరుకానున్నారని అంచనా. 2015 తర్వాత ప్రధాని మోదీ యూఏఈలో పర్యటించడం ఇది ఏడోసారి.

# బరిలో నిలిచేదెవరో?

హైదరాబాద్,తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత తొలి సారిగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రేవంత్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. తొలి రోజు నుంచి ప్రజాసం క్షేమమే ధ్యేయంగా రేవంత్ పాలనపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు రేవంత్ సర్కార్ అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. బడ్జెట్ లోనూ ఆరు గ్యారెంటీల అమలుకు పెద్ద పీట వేసింది. సముచిత కేటాయింపులు జరిపింది. గత ప్రభుత్వం తరహాలో కాకుండా నిజమైన అర్హులకు ప్రభుత్వ ఫలాలు అందించడంపై రేవంత్ సర్కార్ దృష్టిపెట్టింది. ఫలితంగా సీఎంగా రేవంత్ బాధ్యతలు చేపట్టిన రెండు నెలలోనే కాంగ్రెస్ పార్టీకి ప్రజా ఆదరణ పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల సంఘం బీఆర్ ఎస్ విజయాన్ని కాంక్షించినవారు సైతం ప్రస్తుతం కాంగ్రెస్ వైపు మళ్లుతున్నారు. దీంతో మరో రెండు నెలల్లో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలలో విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణలో మొత్తం 17 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. మరో రెండు నెలల్లో జరగనున్న ఈ ఎన్నికల్లో 12 నుంచి 15 స్థానాల్లో విజయం సాధించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించింది. దీనికి తోడు అన్ని నియోజక వర్గాల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ప్రజాదరణ పెరగడంతో గెలుపు తేలిక అవుతుందనే బరిలో నిలిచేందుకు పోటీ పడుతున్నారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా పోటీ చేసేందుకు గాంధీ ఆసక్తి ఉన్నవారు భవన్ లో దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ అధికంగా ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది. మొత్తం 10 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను తొమ్మిది నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. వీరిలో ఖమ్మం నియోజకవర్గం నుంచి తుమ్మల, పాలేరు నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మధిర నుంచి భట్టి విక్రమార్క ఉన్నారు. వీరు ముగ్గురు ప్రస్తుతం రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో ఉన్నారు. భట్టి డిప్యూటీ సీఎంగా ఉండగా, తుమ్మల, పొంగులేటి మంత్రులుగా ఉన్నారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచేందుకు భట్టి విక్రమార్క సతీమణి నందినితో పాటు పొంగులేటి శ్రీనివాస్ సోదరుడు, తుమ్మల నాగేశ్వరరావు తనయుడు, రేణుకా చౌదరి, వంకాయలపాటి రాజేంద్ర, హనుమంతరావులు ఉన్నారు. వీరంతా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. అయితే, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సోనియాగాంధీ ఈ దఫా బరిలోకి దిగుతారని ప్రచారం జరిగింది. ఒక వేళ సోనియా కాకుంటే ప్రియాంక గాంధీ ఖమ్మం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. దీనికితోడు సోనియా ఖమ్మం పార్లమెంట్ నుంచి పోటీచేయాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీ వెళ్లి విజ్ఞప్తి చేశారు. ఆమె కూడా అందుకు అంగీకరించారనీ, ఖమ్మం నుంచి సోనియాయే పోటీ చేస్తారని కాంగ్రెస్ వర్గాలు భావించాయి. అయితే ఇప్పుడు సోనియా ఖమ్మం నుంచి పోటీ చేయడం లేదని తేలిపోయింది. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని సోనియా నిర్ణయించారు. రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్లనున్నారు. సోనియా గాంధీ రాజ్యసభకు వెళ్లడం ఖరారు కావడంతో ప్రియాంక గాంధీ ఖమ్మం నుంచి లోక్ సభ ఎన్నికల బరిలోకి దిగుతారని భావించారు. కానీ, ప్రియాంక గాంధీ సోనియా నియోజకవర్గం అయిన రాయ్ బరేలి నుంచి పోటీ చేయనున్నారు. సోనియా, ప్రియాంక ఇద్దరూ ఖమ్మం నుంచి పోటీ చేయడం లేదపోవడంతో ఖమ్మం నుంచి ఎవరికి అవకాశం దక్కుతుందోనన్న అంశం ఆసక్తికరంగా మారింది. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో రేణుకా చౌదరి పోటీ చేశారు. బీఆర్ ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు చేతిలో ఓటమి పాలయ్యారు. మరోసారి రేణుకా చౌదరి పోటీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. భట్టి సతీమణి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు, వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ పేర్లు కూడా ఖమ్మం రేసులో గట్టిగా వినిపిస్తున్నాయి. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని చెప్పొచ్చు. ఈదఫా ఎన్నికల్లో ఎవరు బరిలో నిలిచినా కాంగ్రెస్ విజయం ఖాయమన్నవాదన రాజకీయ వర్గాల్లో ఉంది.

# పాకిస్తాన్ లో నవాజ్-బిలావల్ మధ్య అధికారం పంపకం!

ఇస్లామాబాద్, పాకిస్థాన్‌లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం దాదాపు ఖాయమైంది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ప్రధాన పార్టీలైన మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు చెందిన పీఎంఎల్(ఎన్), బిలావల్ బుట్టోకు చెందిన పీపీపీ పార్టీలు ప్రధాని పదవిని పంచుకోనున్నట్లు తెలుస్తోంది. మేరకు రెండు పార్టీల మధ్య ఇప్పటికే ఒప్పందం జరిగినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం ఈ విషయమై ఇరు పార్టీల మధ్య ప్రాథమికంగా ఒప్పందం కుదిరింది. మొత్తం ఐదేళ్లలో ఒక పార్టీ మూడేళ్లు, మరో పార్టీ రెండేళ్లు ప్రధాని పదవి పంచుకునేందుకు అంగీకరించినట్లు సమాచారం.తీవల జరిగిన పాకిస్తాన్ ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సాధారణ మెజారిటీ ఏ పార్టీకీ రాలేదు. దీంతో అత్యధిక సీట్లు సాధించిన ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన తెహ్రీక్ ఈ పాకిస్థాన్ పార్టీని అధికారం నుంచి దూరం చేయడానికి మిగిలిన ప్రధాన పార్టీలన్నీ ఏకమై సంకీర్ణ ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.

# మేడిగడ్డపై విజిలెన్స్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు!!



హైదరాబాద్,మేడిగడ్డ బ్యారేజ్‌కు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణ సర్కార్ విజిలెన్స్ విచారణ చేపట్టడంతో అనేక అక్రమాలు బయటపడ్డాయి. కేసీఆర్ సర్కార్ భారీగా అంచనాలను పెంచేసినట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. మేడిగడ్డ ప్రాజెక్టు మొదట అంచనా రూ. 2 వేల 472 కోట్లు. ఏకంగా 133.67 శాతం అంచనాలు గత ప్రభుత్వం పెంచేసింది. 4 వేల 321 కోట్లు ఖర్చు చేసింది కేసీఆర్ సర్కార్. ఈ విషయాలను ఆధారాలతో సహా విజిలెన్స్ బయటపెట్టింది.డ్యామ్ కుంగిపోవడానికి గల అనేక కారణాలు, అనుమానాలను తెరపైకి తీసుకొచ్చింది విజిలెన్స్. డ్యామ్ నిర్మాణం పూర్తయ్యాక కాఫర్ డ్యామ్, షీట్ పైల్స్‌ను తొలగించలేదు. అందువల్లే పియర్స్ కుంగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేసింది. నదీ సహజ ప్రవాహంపై కాఫర్ డ్యామ్ ప్రభావం పడిందని తేల్చింది. డిజైన్‌లో ఉన్నట్లుగా కటాఫ్ వాల్స్‌కు, రాఫ్ట్ వాల్స్‌కు మధ్య నిర్మాణం జరగలేదని విజిలెన్స్ విచారణలో తేలింది. అసలు నిర్మాణమే పూర్తి కాకపోయినా 2019న సెప్టెంబర్ 10న సర్టిఫికెట్ జారీ చేసింది. పనులు పూర్తికాకుండానే 2021 మార్చి 15న ఏజెన్సీకి పనులు పూర్తైనట్లు సర్టిఫికెట్ ఇచ్చేసింది అప్పటి గులాబీ సర్కార్. ఇంజనీర్ ఇన్ ఛార్జ్ ఇచ్చిన నోటీసును కూడా పట్టించుకోకుండా రూ. 159 కోట్ల సెక్యూరిటీస్ కూడా విడుదల చేసింది.ప్రాజెక్ట్ నిర్మాణ అనుమతుల విషయంలో కూడా భారీగా లోపాలు ఉన్నట్టు తేల్చింది విజిలెన్స్. అసలు అనేక నిర్మాణాలకు ఉన్నతాధికారుల అనుమతే లేనట్టు తేల్చింది. 2019 జూన్ 19న బ్యారేజ్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఏ ఏజెన్సీ గానీ, నీటిపారుదల శాఖ గాని ఎలాంటి తనిఖీలు, పరిశీలనలు చేయలేదని మొత్తం మేడిగడ్డ బ్యారేజ్ నిర్వహణ అస్తవ్యస్థంగా ఉందని తెలిపింది. ప్రతి వర్షాకాలం తర్వాత మేడిగడ్డ బ్యారేజ్ యాప్రాన్ ప్రాంతాన్ని మెయింటెనెన్స్ చేయాలి. కానీ అలా జరగలేదు. నిబంధనల ప్రకారం బ్యారేజ్ లో నీటి నిల్వల పెంపు, తగ్గుదల స్థాయిలను సరిగా మెయింటైన్ చేయలేదు. అసలు బ్యారేజ్ నిర్మించిన కాంట్రాక్టర్ నిర్మాణ పనుల మొత్తాన్ని పూర్తిచేయనే లేదని తేల్చింది విజిలెన్స్.మరో సంచలన విషయాన్ని బయటపెట్టింది విజిలెన్స్ రిపోర్ట్. లీకైన 6, 7, 8 పిల్లర్లను అస్సలు కాంట్రాక్ట్ సంస్థ ఎల్ అండ్ టి నిర్మించలేదు. ఆ పిల్లర్లను సబ్ కాంట్రాక్ట్ సంస్థ నిర్మించింది. ఈ వ్యవహారంపై పూర్తి ఆధారాలను విజిలెన్స్ సేకరించింది. మరో వైపు 3-డీ నమూనాల అధ్యయనాల ప్రకారం బ్యారేజ్ ఎగువ దిగువన వరద ప్రవాహాన్ని తగ్గించే పనులు చేపట్టనట్టు కూడా గుర్తించింది. ప్రాజెక్టులో ఏవైనా లోపాలున్నా.. నిర్మాణంలో అవకతవకలున్నా.. సరిచేయాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థదే. కానీ ప్రాజెక్ట్ కుంగిన తర్వాత అలా జరిగే అవకాశం లేకుండా పోయింది. ఎందుకంటే 2021లో కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ముందే డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ 2020 నవంబర్ 11 నుంచి మొదలవుతుందంటూ ఇంజినీర్ ఇన్ చీఫ్ లేఖ విడుదల చేశారు. వాస్తవానికి బ్యారేజ్ పూర్తిగా నిర్మించి.. రెండేళ్లు పూర్తయిన తర్వాత అంతా బాగుంది అనుకుంటేనే ఈ లయబిలిటీ సర్టిఫికెట్ ఇవ్వాలి. కానీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నిర్మాణం పూర్తికాకుండానే ఈ సర్టిఫికెట్ ఇచ్చేశారు. అంతేకాదు సంస్థ సమర్పించిన బ్యాంక్ గ్యారంటీల తిరిగి చెల్లింపుకు అధికారులు అనుమతినిచ్చేశారు. దీంతో ఇప్పుడీ భారం మొత్తం ప్రజలపై పడనుంది. దీనిపై ఇంజినీర్ ఇన్ చీఫ్ పై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని సిఫార్స్ చేసింది విజిలెన్స్. బ్యారేజ్ కుంగుబాటుకు గల కారణాలు కోసం ప్రాజెక్టు డిజైన్స్ అండ్ డ్రాయింగ్స్ పరిశీలించాలని విజిలెన్స్ రిపోర్ట్ అభిప్రాయం వ్యక్తం చేసింది. వాటితోపాటు జియోలాజిక్ ఇన్వెస్టిగేషన్ తో బ్యారేజ్ లోని అన్ని కాంపోనెన్లు డిజైన్ ప్రకారమే ఉన్నాయా? ఒక దానికొకటి అనుసంధానమై పటిష్టంగా ఉన్నాయా? అన్న విషయాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటిని ఏర్పాటు చేయాలని విజిలెన్స్ నివేదిక ప్రభుత్వనికి సిఫార్స్ చేసింది.

# చంద్రబాబు అంటే విజనరీ..

అమరావతి,జగన్ అంటే ఓ ప్రిజనరీ.. చంద్రబాబు అంటే విజనరీ అంటూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. జగన్ ను చూస్తే ఓ ఖైదీ గుర్తుకొస్తారని, చంద్రబాబును చూస్తే విజన్ ఉన్న నాయకుడు కనిపిస్తారని అన్నారు. ఇటీవల జగన్ మీబిడ్డ మీబిడ్డ అని అంటున్నారని చెబుతూ ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.మీ బిడ్డ అని ఎందుకు అంటున్నానంటే.. పొరపాటున మళ్లీ గెలిచి అధికారంలోకి వస్తే నేను మీ బిడ్డను కదా మీ భూమి నాకు ఇచ్చేయండంటూ జగన్ గుంజుకుంటారని లోకేశ్ చెప్పారు.

మంచి చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జనం

ఉత్తరాంధ్రలోని పాతపట్నంలో మంగళవారం జరిగిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ, బాంబులకే భయపడని కుటుంబం మాది, మీ ప్రభుత్వం పెట్టే కేసులకు భయపడతామా అంటూ జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. భయం తమ బయోడేటాలోనే లేదని చెప్పారు. చంద్రబాబును అరెస్టు చేసి జైలులో పెడితే టీడీపీ శ్రేణులు అధైర్యపడతారని జగన్ భావించారని అన్నారు. ఏ తప్పూ చేయని చంద్రబాబును 53 రోజులు జైలుకు పంపించారన్నారు. .. లక్ష కోట్ల అవినీతికి పాల్పడిన జగన్ జైలుకు వెళ్లే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా ప్రజల రక్తంలోనే పౌరుషం ఉందన్నారు. మంచి చేసిన వారిని జీవితాంతం గుర్తుపెట్టుకుంటారని, అన్యాయం చేసిన వారిని ఇక్కడే పాతిపెడతారని.. ఆ శక్తి కేవలం శ్రీకాకుళం జిల్లా ప్రజలకు మాత్రమే ఉందని మెచ్చుకున్నారు.

జాబ్ క్యాలెండర్

ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్.. ఐదేళ్లూ ఆ విషయమే పట్టించుకోకుండా తీరా ఎన్నికల ముందు జాబ్ నోటిఫికేషన్లు ఇస్తున్నాడని చెప్పారు. ఇది నిరుద్యోగులను మభ్యపెట్టడమేనని చెబుతూ మోసపోవద్దంటూ నిరుద్యోగులను లోకేశ్ హెచ్చరించారు. లక్షల్లో ఖర్చు చేసి కోచింగ్ లు తీసుకుని జాబ్ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత కష్టాలు తనకు తెలుసని అన్నారు. ఒక్క రెండు నెలలు ఓపిక పడితే టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, అప్పుడు ఏటా జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

ఇంతకీ అవినీతి మొత్తం ఎంత జగన్

చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసినపుడు 200 కోట్ల అవినీతి జరిగిందని ప్రభుత్వం ఆరోపించిందని లోకేశ్ గుర్తుచేశారు. ఆ తర్వాత అది 275 కోట్లకు, నిన్న కాక మొన్న కేవలం 27 కోట్ల అవినీతి అంటూ అధికారులు చెబుతున్నారని ఆరోపించారు. 'మీ ప్రభుత్వ అవినీతి, మా చిత్తశుద్ధి' పై చర్చకు ఎప్పుడైనా సరే సిద్ధమని నారా లోకేశ్ చెప్పారు. టైము డేటు ఫిక్స్ చేసి చెప్పాలంటూ జగన్ కు సవాల్ విసిరారు.

బోర్డులపైనే మీ నమ్మకం ..

'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ పలుచోట్ల బోర్డులు కనిపిస్తున్నాయని నారా లోకేశ్ చెప్పారు. ఆ బోర్డుల్లో ఎవరెవరో కనిపిస్తున్నారని అంటూ.. 'మీ అమ్మ, మీ చెల్లెలే మిమ్మల్ని నమ్మలేదు.. మమ్మల్నెలా నమ్మమంటావు' అంటూ జగన్ ను ప్రశ్నించారు. ఎన్నికల ముందు అమ్మను, చెల్లెను వాడుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత వాళ్లిద్దరినీ మెడబట్టి బయటకు పంపించాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్ సొంత చెల్లెలు షర్మిలతో పాటు వైఎస్ సునీత తమకు ప్రాణహాని ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసే పరిస్థితి వచ్చిందని గుర్తుచేశారు. ఇంట్లో ఉన్న మహిళలకే రక్షణ కల్పించలేని ఈ ముఖ్యమంత్రి మనకు రక్షణ కల్పిస్తాడా? అనేది ఇక్కడున్న మహిళలు ఆలోచించాలని లోకేశ్ చెప్పారు.

# పట్టణాల్లో నిరుద్యోగిత 6.5.. మహిళల నిరుద్యోగిత రేటు 8.6 శాతం

న్యేఢిల్లీ,పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం రేటు మూడో త్రైమాసికంలో (అక్టోబరు-డిసెంబరు 2023) 15 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వ్యక్తులకు 6.5 శాతంగా నమోదైంది. మహిళల నిరుద్యోగిత రేటు 8.6 శాతం నమోదైంది. ఈ మేరకు కేంద్ర గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో శ్రామికశక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పిఆర్) 2022 మూడో త్రైమాసికంలో 48.2 శాతం నుండి 15 ఏళు ,, అంతకంటే ఎక్కువ వయసు గల వ్యక్తుల కోసం 2023 మూడో త్రైమాసికంలో 49.9 శాతానికి పెరుగుతున్న ధోరణిని చూపించిందని మంత్రిత్వశాఖ తెలిపింది. అదే కాలంలో, మహిళా శ్రామికశక్తి భాగస్వామ్య రేటు 22.3 శాతం నుంచి 25 శాతానికి పెరిగింది. ఇది ఎల్ఎఫ్‌పిఆర్‌లో మొత్తం పెరుగుతున్న ధోరణిని ప్రతిబింబిస్తుందని తెలిపింది. వర్కర్-పాపులేషన్ రేషియో (డబ్ల్యుపిఆర్)లో పెరుగుతున్న ట్రెండ్ గుర్తించింది. పట్టణ ప్రాంతాల్లో ఎల్ఎఫ్‌పిఆర్ అక్టోబర్-డిసెంబర్ 2022లో 44.7 శాతం నుండి అక్టోబర్- డిసెంబర్ 2023 నాటికి 46.6 శాతానికి పెరిగింది. పురుషుల్లో ఈ కాలంలో ఇది 68.6 శాతం నుండి 69.8 శాతానికి పెరిగింది. మహిళల్లో ఇది 20.2 శాతం నుండి 22.9 శాతానికి పెరిగింది. ఏప్రిల్-జూన్ 2023లో పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు ఏడాది క్రితం 7.6 శాతం నుండి 6.6 శాతానికి తగ్గింది. ప్రధానంగా దేశంలో కోవిడ్-సంబంధిత పరిమితుల అస్థిరమైన ప్రభావం కారణంగా ఏప్రిల్-జూన్ 2022లో నిరుద్యోగం ఎక్కువగా ఉంది.

# పవన్ రీఎంట్రీ ...

భీమవరం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గత ఎన్నికల్లో భీమవరం, గాజువాకలలో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. గత ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లకు ఈసారి అవకాశం లేకుండా పక్క వ్యూహంతో జనసేనని ఉన్నారనేది ఆ పార్టీ నాయకుల ప్రణాళికలు చూస్తే తెలుస్తుంది. గతంలోలా రెండు చోట్ల పోటీ చేయకుండా కేవలం భీమవరం నుంచే పకడ్బందీ వ్యూహంతో ఎన్నికల బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేశారనేది జనసేన వర్గాలను అందుతున్న సమాచారం. భీమవరం నుంచి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటికి సిద్ధకావడంతో జనసేన వర్గంలో జోష్ కనిపిస్తోంది. పవన్ పోటీపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు.

జనసైనికుల తహతహ..

పవన్ కళ్యాణ్ సొంత జిల్లా పశ్చిమగోదావరిలో జనసేన, టీడీపీ కూటమి బలంగా కనిపిస్తోంది. ఈ కూటమి బలాన్ని జనసేన బలోపేతానికి, జనసేనాని గెలుపుకి ఉపయోగించుకోవాలని జనసైనికులు తహతహలాడుతున్నారు.పవన్ కళ్యాణ్ తిరిగి భీమవరం నుంచి పోటీ కి సిద్ధమైనట్లు వస్తున్న సమాచారంతో తెలుగు రాష్ట్రాల్లో భీమవరం పై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. చర్చలతో పాటు జనసేన సేనాని గెలుపు పై జోరుగా పందాలు కాస్తున్నారు.

త్రిముఖ పోరులో..

గత ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల త్రిముఖ పోరులో జనసేనాని పై వైసీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ సుమారు నాలుగు శాతం ఓట్లతో విజయం సాధించారు. నేడు జనసేన, టీడీపీ పార్టీలు పొత్తులో భాగంగా ఒకటవ్వడంతో గతంలో టీడీపీకి పడిన ఓట్లు జనసేనకు బదిలీ అవుతాయనే ధీమాతో జనసేన నాయకులు ఉన్నారు. ఈసారి ఎలాగైనా భీమవరం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలనే సంకల్పంతో జనసేన ఇక్కడ పనిచేస్తున్నాయి. ఇంకా ఎన్నికలకు సుమారు రెండు నెలలు మాత్రమే సమయం ఉండడంతో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే భీమవరం ఎన్నికలలో అధికార వైసీపీ నుంచి తిరిగి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. పవన్ కళ్యాణ్ భీమవరం నుంచే పోటీ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడమే మిగిలి ఉందని జన సైనికులు చెబుతున్నారు.

బలంగా భీమవరం సెంటిమెంట్..

భీమవరంలో ఏ పార్టీ విజయం సాధిస్తుందో ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనేది ఇక్కడ నానుడి. ఇందుకు గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు, రాష్ట్రంలో అధికారం చేపట్టిన పార్టీలనే ఉదాహరణగా చెబుతూ ఉంటారు. ఇక్కడ నుంచి గెలుపొందిన అభ్యర్థులు ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పారు. ఒకప్పుడు క్షత్రియలకు కంచుకోటగా ఉన్న భీమవరం నియోజవర్గం నేడు కాపు సామాజి వర్గానికి కంచుకోటగా మారింది.

జనసేన జోరు..

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కోసం జనసేన నాయకులు భీమవరం నియోజకవర్గంలో జోరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒకవైపు పార్టీలోకి చేరికలను ప్రోత్సహిస్తూనే మరోవైపు తమ కూటమిలో భాగస్వామ్యటీడీపీ తో కలిసి ఇంటింటికి కార్యక్రమాలను జనంలోకి జనసేన ను తీసుకు వెళ్తున్నారు. సుమారు నెలరోజులుగా జనంలోకి జనసేన కార్యక్రమాన్ని భీమవరం నియోజకవర్గంలో నిర్వహిస్తున్నారు. జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) మార్గ నిర్దేశంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో జనసేన కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. జనసేన నాయకులు ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ జనసేన, టీడీపీ కూటమికి ఈసారి మద్దతు తెలపాలని కోరుతున్నారు. పనిలో పనిగా వైసిపి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు ఎక్కువ పెడుతున్నారు.

భీమవరానికి 14న పవన్ రాక

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉభయ గోదావరి జిల్లాల పర్యటన ఈనెల 14న భీమవరం నుంచే ప్రారంభించనున్నారు. మూడు రోజులపాటు ఈ పర్యటన సాగనుంది. 14న తొలి రోజు భీమవరంలో పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించే సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడతారు. అనంతరం పాలకొల్లులో నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారు. పశ్చిమ సమావేశాల అనంతరం అమలాపురం, కాకినాడ, రాజమండ్రిలలో జరిగే సమావేశాల్లో పవన్ కళ్యాణ్ పాల్గొంటారు. పవన్ భీమవరం పర్యటనలో తెలుగుదేశం ముఖ్య నాయకులతో కూడా ప్రత్యేకంగా చర్చించనున్నట్లు సమాచారం. టీడీపీ జనసేన శ్రేణుల ఐక్యంగా ముందుకు సాగటం, భవిష్యత్తు లక్ష్యాలపై ఈ భేటీలో ప్రస్తావించనున్నారు. భీమవరం నుంచే తన పోటీ ఖరారు చేస్తున్నట్లు పవన్ ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

# 12 మంది ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, రాష్ట్రంలో నలుగురు ఐఏఎస్, 12 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ అదనపు కలెక్టర్ చిత్రమిశ్రాను ఐటీడీఏ ఏటునాగారం ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. ఐటీడీఏ ఏటునాగారం ప్రాజెక్టు అధికారి అంకిత్‌ను నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాను ఉట్నూరు ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చేతన్ బాజ్‌పాయ్‌ను తదుపరి

# హైదరాబాద్-విజయవాడ హైవే మరమ్మతులకు మోక్షం



హైదరాబాద్,హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలోని ప్రమాదకర ప్రాంతాల(బ్లాక్ స్పాట్స్) దిద్దుబాటుకు మార్గం సుగమంకానుంది. ఎట్టకేలకు ఆరుగురు గుత్తేదారులు టెండర్ల దాఖలుకు ముందుకు వచ్చారు. గుత్తేదారులు ముందుకు రాకపోవటంతో పలు దఫాలు వాయిదా పడిన ప్రక్రియ ఈ సారైనా కొలిక్కి వస్తుందనే ఆశాభావాన్ని అధికారులు వ్యక్తంచేస్తున్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలో పంతంగి టోల్‌ఎ÷-లాజా నుంచి తెలంగాణ సరిహద్దులోని నల్లబండగూడెం వరకు సుమారు 17 ప్రాంతాల్లో తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాటిని చక్కదిద్దాలని గడిచిన కొన్నేళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన కారణంగా వాహనాల రద్దీ తగ్గిన నేపథ్యంలో నాలుగు వరసల రహదారిని ఆరు వరసలకు విస్తరించే అవకాశం లేదని, ప్రమాదకర ప్రాంతాలను సరిదిద్దేందుకు త్వరలో టెండర్లు ఆహ్వానిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గడచిన ఏడాది లోక్‌సభలో ప్రకటించారు. మేరకు గతేడు జూన్ నెలలో తొలిసారి టెండర్లు ఆహ్వానించారు. గుత్తేదారుల ముందుకు రాలేదు. తర్వాత మరో రెండుసార్లు టెండర్లు పిలిచినా ఇదే పరిస్థితి. నాలుగో దఫా టెండర్లు ఆహ్వానించిన సందర్భంలో ముగ్గురు గుత్తేదారులు టెండర్లు దాఖలు చేయగా సాంకేతిక స్థాయిలో ఒకరు అనర్హతకు గురయ్యారు. ఆర్థిక బిడ్ల సమయంలో మరొకరు అనర్హతకు గురికావడంతో ఒక్కరే పోటీలో మిగిలారు. దీంతో కేంద్రం టెండరు రద్దు చేసింది. మరోదఫా రెండు సార్లు నోటిఫికేషన్ జారీ చేసినా ఫలితం లేకపోయింది. తాజాగా గతేడు డిసెంబరులో మరోదఫా కేంద్రం టెండర్లు ఆహ్వానించింది. టెండర్లు దాఖలు చేసేందుకు ఈ నెల పదో తేదీ చివరి గడువు కావటంతో ఆరుగురు గుత్తేదారులు ముందుకొచ్చారు. సాంకేతికంగా ఆరు టెండర్లు అర్హత పొందినట్లు సమాచారం. 17 ప్రాంతాల్లో దిద్దుబాటు పనులకు రూ.326 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

# ఈ 'వ్యవస్థ'తో కొందరికే ప్రయోజనం : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,దేశంలోని 'వ్యవస్థ'తో నేతలు మాత్రమే ప్రయోజనం పొందేందుకు కాంగ్రెస్ రాహుల్ గాంధీ కేంద్రంపై ధ్వజమెత్తారు. మిగిలిన వారంతా పన్నులు చెల్లిస్తూ, ఆకలితో చనిపోతున్నారని అన్నారు. ఏవిషయాన్నైనా వ్యతిరేకిస్తూ గొంతెత్తితే.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ, ఐటి శాఖ దాడులను ఎదుర్కోవాల్సిందేనని అన్నారు.

తన భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా ఏర్పాటు ఉదయపూర్ ప్రాంతంలో రాహుల్ మాట్లాడారు. 24 గంటలూ ప్రజలకు అన్యాయం జరుగుతుంటే దేశంలో హింస, విద్వేషాలు వ్యాపిస్తున్నాయని అన్నారు. ప్రజలు గ్రహించలేకపోతే , దోపిడీ నిరంతరం ఓ ప్రక్రియలా జరుగుతూనే ఉంటుందని అన్నారు."మీరు ప్రతిరోజూ దేశ నిధి నుండి ఎంత నగదు పొందుతున్నారు అని మూడుసార్లు మీకు (ప్రజలు) మీరే ప్రశ్న వేసుకోవాలి. రోజంతా పోరాటం, ప్రయత్నం తర్వాత ఎంత రాబడిపొందుతున్నారో తెలుసుకోండి. పదిరోజుల తర్వాత మిమ్మల్ని ఒక వ్యవస్థ నిర్వీర్యం చేస్తోందని, దానికి సూత్రధారుడిగా ప్రధాని మోడీ ఉన్నారని మీకు తెలుస్తుంది" అని అన్నారు. వ్యవస్థ ప్రజలను ఎలా దోచుకుంటుందో ఓ చిన్న ఉదాహరణతో వివరించారు." ఓ వ్యక్తి మార్కెట్‌కు వెళ్లినపుడు.. ముగ్గురు దొంగలు



అతని వాలెట్‌ను దోచుకోవాలనుకున్నారు. మొదటి దొంగ ఆ వ్యక్తి దృష్టి మరలుస్తాడు. ఇదే వ్యవస్థ మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తోంది. అదే సమయంలో రెండో దొంగ మీ వాలెట్ దొంగిలిస్తాడు. జీఎస్‌టి, నోట్లరద్దు రెండూ దోచుకోవడమే. నువ్వు తిరిగి ప్రశ్నిస్తే..మూడో దొంగ నిన్ను రెండు సార్లు కొడతాడు. ఒకవేళ నువ్వు దుకాణదారుడివిగా ఉండి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తే.. ఇడి, సిబిఐ, ఐటి దాడులతో బెదిరింపులు వస్తాయి "అని అన్నారు.

# కారుణ్య నియామకాలపై ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం

హైదరాబాద్,కారుణ్య నియామకం కింద తెలంగాణా వాసులకు ఉద్దేశించిన ఉద్యోగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిని నియమించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన సందర్భంగా ఆమె ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. స్థానికులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, దాని ప్రకారం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టాలు కూడా చేసిందన్నారు. అయితే, కొత్త కాంగ్రెస్ హయాంలో, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన ఎ రామిరెడ్డి కుమారుడు ఎ రఘునాథ్ రెడ్డికి పాత ప్రభుత్వ ఉత్తర్వును ఉపయోగించి కారుణ్య ప్రాతిపదికన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ విభాగంలో ఉద్యోగం ఇచ్చారు.రఘునాథ్‌రెడ్డి పాఠశాల విద్యాభ్యాసం అంతా కర్నూల్‌లోనే జరిగిందని, అతను తెలంగాణ వ్యక్తి కాకపోయినప్పటికీ 2007 జూలై 12న ఇచ్చిన జీవోను కోట్ చేస్తూ కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. అప్పటికి రాష్ట్రం కలిసే ఉందని, 2014 తర్వాత మన రాష్ట్ర అవసరాలకు తగ్గట్లుగా ఎన్నో నిబంధనలు మారాయని ఆమె చెప్పారు. అలాంటప్పుడు రఘునాథ్‌రెడ్డికి కంపాషనేట్ అపాయింట్‌మెంట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇది చాలా దారుణమని, తెలంగాణ ప్రాంత బిడ్డలకు ఉద్యోగాల్లో అన్యాయం జరిగితే



పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ బిడ్డల పొట్ట కొట్టొద్దని కోరారు. ఈ సందర్భంగా అక్రమ నియామకం విషయాన్ని లేఖ రూపంలో మండలి చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ.. ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. అయితే సమస్యను పరిశీలించి అవసరమైతే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# దూకుడు పెంచిన షర్మిల..



అమరావతి, పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చెప్పట్టిన నాటి నుంచి వైసీపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దూసుకుపోతున్నారు వైఎస్ షర్మిల. ఏపీకి నియంత పాలన నుంచి విముక్తి కల్పించడమే తన లక్ష్యమంటున్న షర్మిలపై.. వైసీపీ నేతలు ఎదురుదాడి మొదలుపెట్టారు. ముఖ్యంగా మంత్రి రోజా ఆమెపై ధ్వజమెత్తడమే పనిగా పెట్టుకున్నట్లు కనిపిస్తున్నారు. చంద్రబాబు వదిలిన బాణం షర్మిల అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. వైసీపీ నేతల విమర్శలకు షర్మిల గట్టిగానే కౌంటర్లు ఇస్తున్నారు. వైసీపీ నుండి రోజుకో జోకర్ మాట్లాడుతున్నారంటున్న షర్మిల.. నగరి టూర్‌లో రోజాపై చేసిన ఆరోపణలతో పొలిటికల్ హీట్ పెరిగిపోతోంది.ఎన్నికల వేళ ఆంధ్రప్రదేశ్‌లో ఏపీసీసీ చీఫ్ షర్మిల వర్సెస్ వైసీపీగా రాజకీయం మారుతోంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల సీఎం జగన్‌పై, వైసీపీ నేతలపై విమర్శల వర్షం కురిపిస్తూ దూసుకుపోతుండటం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపుతోంది. షర్మిలకు ధీటుగా వైసీపీ నేతలు సైతం కౌంటర్లు ఇస్తున్నారు. ముఖ్యంగా మంత్రి రోజా ఆమెను టార్గెట్ చేయడంలో ముందుంటున్నారు.తాజాగా వైఎస్ షర్మిల రాష్ట్ర మంత్రి ఆర్కే రోజాపై చేసిన ఆరోపణలు నగరి నియోజకవర్గంలో ప్రకంపనలు రేపుతున్నాయి. మంత్రి రోజా నియోజకవర్గంలో జబర్దస్త్ దోపిడీ జరుగుతోందని, రోజా కుటుంబం వందల కోట్లు దోచుకుందని ఆరోపణలు గుప్పించారు. నగరిలో ఒకరు కాదు నలుగురు మంత్రులు ఉన్నారని ప్రజలు అంటున్నారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. రోజా ఓ మంత్రి, ఆమె భర్త ఓ మంత్రి, ఆమె అన్నలు ఇద్దరు కూడా మంత్రులేనంటూ సెటైర్లు విసిరారు. నగరిలో రోజా జబర్దస్త్ దోపిడీకి పాల్పడుతున్నారని, గ్రావెల్స్ వదలరు, చెరువులను, ఇసుక కూడా వదలరని ఆరోపించారు.తాను తెలంగాణలో పార్టీ పుట్టానని రోజా అంటోందని.. గతంలో ఆమె టీడీపీలో ఉన్నప్పుడు ఐరన్ లెగ్ గా ఫేమస్ కాదా అని షర్మిల ఎద్దేవా చేశారు. టీడీపీ నేతగా ఉన్నప్పుడు రోజా.. వైఎస్‌పై చవకబారు కామెంట్లు చేశారని గుర్తుచేశారు. వైఎస్ పంచ ఊడదీసి కొడతానన్న రోజా.. ఇప్పుడు జగన్ పార్టీలో ఉందని యద్దేవా చేశారు. రోజా నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని హెచ్చరించారు.పుట్టింట్లో అన్యాయం జరుగుతోందని, ఏపీకి రావాల్సి వచ్చిందన్నారు. తెలంగాణలో నియంతను గద్దె దింపాను, ఇప్పుడు ఏపీలో నియంతను గద్దె దింపడమే తన ముందున్న లక్ష్యమని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాక ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వైటీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశామని, కాంగ్రెస్ ఉన్నంతవరకు తమ పార్టీ బతికే ఉంటుందన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు జరుగుతున్న ఒక క్రైస్తవుడు అయి ఉండి జగన్ స్పందించలేదని ఫైర్ అయ్యారు.నగరిలో షర్మిల కామెంట్స్‌పై రోజా రియాక్ట్ అయ్యారు. షర్మిల మొన్నటి వరకు తాను తెలంగాణ బిడ్డని అన్నారని.. ఇప్పుడు ఆమె మరో కొత్త అవతారం ఎత్తారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో పార్టీ పెట్టి ఏమి చేయలేక గాలికొదిలేసి%ా%. ఇప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విచ్ఛిన్నం చేసిన కాంగ్రెస్ పార్టీలో చేరారని విమర్శించారు.నిజమైన రాజన్న బిడ్డ సీఎం జగన్ మాత్రమేనని రోజా సంచలన వ్యాఖ్యలు చేశారు. వైఎస్ షర్మిల కేవలం వైఎస్ ఆస్తుల కోసమే రోడ్డు ఎక్కారని తీవ్ర ఆరోపణలు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు వదిలిన బాణం షర్మిల అని సెటైర్ వేశారు. షర్మిల వేషం కాంగ్రెస్ ది.. స్క్రిప్ట్ చంద్రబాబుది అంటూ విమర్శించారు.మొత్తానికి నగరిలో రోజాపై వైఎస్ షర్మిల చేసిన అవినీతి ఆరోపణలలో ఏపీలో పొలిటికల్ హీట్ పెరిగిపోతోంది. ఒకవైపు నగరి సీటుపై క్లారిటీ లేక కన్ఫ్యూజన్‌లో ఉన్న మంత్రి రోజా.. అధినేతను ప్రసన్నం చేసుకోవడానికి షర్మిలను టార్గెట్ చేయడమే పనిగా పెట్టుకున్నారన్న సెటైర్లు షోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మరి చూడాలి రాష్టానికి ప్రత్యేక హోదా వచ్చే వరకు ఇక్కడి నుంచి కదలనంటున్న వైఎస్ షర్మిలారెడ్డి దూకుడు మున్ముందు ఎలా ఉంటుందో.

# సుదీర్ఘ నిరసనకు సిద్ధమైన రైతులు



న్యూఢిల్లీ, తమ డిమాండ్లను నెరవేర్చుకునే లక్ష్యంతో మంగళవారం దేశ రాజధాని ఢిల్లీ దిశగా అన్నదాతలు కదిలారు. ఈ ఉదయం పంజాబ్, హరియాణా నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో నగరానికి బయల్దేరారు. ఈ క్రమంలో కొన్ని కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన నిఘా నివేదిక ప్రకారం.. ఒక్క పంజాబ్నుంచే వందల సంఖ్యలో ట్రాక్టర్లు, వాహనాలు బయల్దేరతాయని, వాటిలో అన్నదాతలు ఆరు నెలలకు సరిపడా ఆహారం, ఇతర సామగ్రిని తీసుకువస్తారని తెలిపింది. కొందరు రైతులు మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వం, పోలీసులు తమ సహనానికి పరీక్ష పెట్టినా డిమాండ్లు నెరవేరేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. 'సుత్తి, రాళ్లను పగలకొట్టే పరికరాలతో సహా కావాల్సినవన్నీ మా ట్రాలీల్లో ఉన్నాయి. ఆరు నెలలకు సరిపడా రేషన్, డీజిల్‌తో మేం మా ప్రాంతాల నుంచి బయలుదేరాం' అని ఓ రైతు మీడియాకు వెల్లడించారు. ఆయన రెండు ట్రాలీల్లో సామగ్రిని తీసుకొని పంజాబ్‌లోని గురుదాస్‌పుర్ నుంచి దేశ రాజధానికి వస్తున్నారు. తమ యాత్రను భగ్నం చేసేందుకు ట్రాక్టర్లకు డీజిల్ దొరక్కుండా చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. 2020-21లో ఉద్యమించిన రైతులు పలువురు ప్రస్తుత ఆందోళనలో పాల్గొంటున్నారు. అప్పట్లో వారు కొన్ని నెలల పాటు దిల్లీలో చలిని లెక్క చేయకుండా నిరసన చేపట్టారు. హామీ ఇచ్చినట్టుగా కేంద్రం తమ డిమాండ్లను నెరవేర్చలేదని, ఇప్పుడు వాటిని సాధించుకున్నాకే తిరిగి వెనక్కివెళతామని వారు స్పష్టంచేశారు. కాగా రైతులు తలపెట్టిన మెగా మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పంజాబ్, హరియాణా మధ్య ఉన్న శంభు సరిహద్దు వద్దకు భారీ సంఖ్యలో వచ్చిన రైతులపై పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. దిల్లీ దిశగా కదులుతున్న వారిని అడ్డుకునేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. బాష్పవాయువు ప్రయోగంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. అలాగే బలగాలు డ్రోన్లతో స్మోక్ బాంబ్స్‌ను జారవిడిచారు. దీంతో నిరసనకారులు, మీడియా ప్రతినిధులు పరుగులుపెట్టినట్లు తెలుస్తోంది. ఆందోళనకారులు వారి ప్రణాళిక ప్రకారం 'దిల్లీ చలో' మార్చ్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలోనే పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను వారు బద్దలుకొట్టేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు వారిని అడ్డుకునేందుకు టియర్‌గ్యాస్ ప్రయోగించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఉదయం 10 గంటలకు పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో దిల్లీ కి బయల్దేరారు. అటు సంగ్రూర్ నుంచి మరో బృందం కూడా ఇంద్రప్రస్థ దిశగా కదిలింది. ఈ సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ జనరల్ సెక్రటరీ శర్వణ్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ.. "మేం బారికేడ్లను బద్దలుకొట్టాలనుకోవడం లేదు. చర్చలతోనే మా సమస్యను పరిష్కరించుకోవాలని భావిస్తున్నాం. కానీ, వారు (కేంద్రం) మాకు ఏ విధంగా సాయం చేయట్లేదు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ర్యాలీ మొదలుపెట్టాం. రోడ్లను బ్లాక్ చేస్తామని మేం చెప్పలేదు. ప్రభుత్వమే అలా చేస్తోంది. పంజాబ్, హరియాణా సరిహద్దులు అంతర్జాతీయ సరిహద్దుల్లా కన్పిస్తున్నాయి" అని అన్నారు. రైతుల ఆందోళనను భగ్నం చేసేందుకు పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నగర సరిహద్దుల్లో భారీగా బలగాలను మోహరించారు. రహదారులపై బహుళ అంచెల్లో బారికేడ్లు ఏర్పాటుచేశారు. పలు చోట్ల కాంక్రీట్ బ్లాక్స్, ఇనుప కంచెలు, మేకులను అడ్డుగా పెట్టారు. దిల్లీ అంతటా నెల రోజుల పాటు 144 సెక్షన్ విధించారు. ముందు జాగ్రత్తగా పార్లమెంట్ సమీపంలో ఉన్న సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్‌ను మూసివేశారు.సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. గాజీపుర్, చిల్లా సరిహద్దుల్లోని హైవేలపై కిలోమీటర్ల మేర వాహనాలు బారులుతీరాయి. ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. కిలోమీటరు దూరానికే గంటకు పైగా సమయం పడుతుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు, అన్నదాతల ఆందోళనను అడ్డుకునేందుకు కేంద్రం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే రైతులను నిర్బంధించేందుకు వీలుగా దిల్లీలోని బావనా ప్రాంతంలో తాత్కాలిక జైలుగా ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. దీన్ని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తోసిపుచ్చారు. రైతన్నలను జైల్లో పెట్టడం సరికాదన్నారు. ఈ ఆందోళనపై కేంద్రం, రైతుల మధ్య సోమవారం అర్ధరాత్రి వరకు జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాల్సిందేనని రైతు నాయకులు చేసిన డిమాండ్‌పై ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో రైతులు ఆందోళన ప్రారంభించారు. ఇదిలా ఉంటే..'దిల్లీ చలో' ఆందోళన ఎలా చేపట్టాలన్న దానిపై రైతు సంఘాలు రిహార్సల్ నిర్వహించాయని, కొందరు రైతులు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా సహా పలువురు భాజపా సీనియర్ నేతల ఇళ్ల ముందు నిరసన చేపట్టే అవకాశాలున్నాయని ఆ నిఘా నివేదిక పేర్కొన్న సంగతి తెలిసిందే.

## కుర్చీలో కేసీఆర్ ఫొటో పెట్టి కాంగ్రెస్ నేతల వినూత్న నిరసన

నల్లగొండ,భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మోసపూరితంగా వ్యవహరించారని నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు విమర్శించారు. కృష్ణా నది ప్రాజెక్టుల వ్యవహారంపై పట్టణంలో నేడు భారాస సభ నేపథ్యంలో క్లాక్‌టవర్ సెంటర్ వద్ద అధికార పార్టీ నాయకులు వినూత్న నిరసన తెలిపారు. కేసీఆర్ చిత్రపటాన్ని కుర్చీలో పెట్టి ఆందోళన చేపట్టారు. 2014, 2019 ఎన్నికల ప్రచారానికి వచ్చిన భారాస అధినేత.. 'నల్గొండ జిల్లాలోని తాగు, సాగునీటి ప్రాజెక్టులను కుర్చీ వేసుకుని కూర్చొని మరీ పూర్తి చేస్తా'మన్నారంటూ సంబంధిత వీడియోను ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఏపీ అసెంబ్లీలో కేసీఆర్‌ను సీఎం జగన్ పొగిడిన వీడియోనూ ప్రసారం చేశారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. 90 శాతం పూర్తయిన వాటిని కూడా పట్టించుకోకపోవడంతో సాగు, తాగునీటి ఎద్దడి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్గొండ ప్రజలకు క్షమాపణ చెప్పాకే ఆయన అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ వైసీపీలో టెన్షన్..

అమరావతి,: వైసీపీలో ఇన్చార్జ్‌లుగా బాధ్యతలు స్వీకరించిన నేతలందరూ ప్రచారంలో దూసుకెళ్లే పనిలో పడ్డారు. అయితే ఆ సెగ్మెంట్ కొత్త ఇన్చార్జ్ మాత్రం రకరకాల డౌట్లతో మీనమేషాలు లెక్కపెడుతున్నారు. చేతిచమురు వదిలించుకుంటూ జనంలోకి వెళ్తే.. చివరికి టికెట్ ఖాయమవుతుందో లేదో? అని టెన్షన్ పడిపోతున్నారు. వివిధ సెగ్మెంట్లలో వైసీపీ అధ్యక్షుడు ప్రకటించిన ఇన్చార్జులు ఓవర్ నైట్ మారిపోతుండటమే అందుకు కారణమంటున్నారు. సదరు సెగ్మెంట్లో సిట్టింగ్ ఎమ్మెల్యేని షిఫ్ట్ చేసి మరీ ఆ నాయకుడికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు జగన్.. అయితే ఆయన కేవలం ఇన్చార్జ్ మాత్రమే అని అభ్యర్థి వేరే ఉన్నారన్న ప్రచారం మొదలైంది. దాంతో సదరు కొత్త నేత దిక్కులు చూడాల్సి వస్తోందంట.వైసీపీ వరుసగా ఇన్చార్జుల లిస్టలు ప్రకటిస్తున్నప్పటి నుంచి.. ఎమ్మెల్యేలు, టికెట్ ఆశావాహుల్లో టెన్షన్ మొదలైంది. ఎవరిని ఉంచుతారో, ఎవరిని తప్పిస్తారో.. అసలు ఈ మార్పులు చేర్పుల్లో టికెట్ దక్కేదెవరికో అర్థం కాక తలలు పట్టుకోవాల్సి వస్తోంది అందరికీ. మరోవైపు ప్రకటించిన ఇన్చార్జిలను కూడా మారుస్తుండటంతో వారిలో టెన్షన్ మరింత పెరిగిపోతోంది.విజయవాడ పశ్చిమ ఇన్చార్జ్ షేక్ ఆసీఫ్ కూడా అదే టెన్షన్‌తో సతమతమవుతున్నారంట. విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావునిని విజయవాడ సెంట్రల్‌కు పంపించిన వైసీపీ పెద్దలు.. వెస్ట్ ఇన్చార్జి బాధ్యతలు ఆసీఫ్‌కి కట్టబెట్టారు. అయితే ఆయనకు బాధ్యతలు కట్టబెట్టినప్పటి నుంచే ఆ సెగ్మెంట్లో సరికొత్త ప్రచారం మొదలైంది. ఆసిఫ్ కేవలం ఇన్చార్జ్ మాత్రమే అని.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఆయన కాదన్న టాక్ ఆ పార్టీల్లోనే వినిపిస్తోంది.ఆ ప్రచారానికి తగ్గట్లే ఇప్పటి వరకు ఆసిఫ్‌కు సీఎం జగన్ నుంచి పిలుపు రాలేదు. పార్టీ పెద్దలు సీఎంఓకి పిలిచి ఆయనకు టికెట్‌పై క్లారిటీ ఇవ్వలేదు. మొదటి లిస్టులోనే పేరు వచ్చినా ఇప్పటి వరకు సీయంఓ నుంచి కబురు రాకపోవడం, జగన్ అపాయింట్‌మెంట్ దొరక్కపోవడంతో ఆసిఫ్ ఎవరికి చెప్పుకోలేక సమతమతవయతున్నారట. ఆసిఫ్ వైసీపీ స్థాపించిన నాటి నుంచి పశ్చిమ నియోజకవర్గంలో యాక్టీవ్ గా పనిచేస్తూ వచ్చారు. గతంలో ఒకసారి ఇన్చార్జ్‌గా పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ.. సెగ్మెంట్లో పార్టీ శ్రేణులపై గ్రిప్ సాధించలేకపోయారన్న అభిప్రాయం ఉంది.కార్పొరేటర్ గా , వైసీపీ మైనారిటి వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించినప్పటికీ.. నియోజకవర్గంలో వెల్లంపల్లి స్థాయిలో పాపులారిటీ సంపాదించుకోలేక పోయారు. మైనారిటీ లీడర్‌గా ఎస్టాబ్లిష్ అయినా.. పార్టీ పరంగా సరైన పదవి కూడా దక్కలేదాయనకి.. విజయవాడ మేయర్ పదవి ఆశించినా దక్కలేదు.. ఎమ్మెల్సీ పదవి అడిగినా ఇవ్వలేదు.. దీంతో పార్టీలో సరైన గుర్తింపు లేదని మధనపడుతుంటారాయన.. ఆ క్రమంలో సిలబస్‌లో



లేని క్వశ్చన్ ఎగ్జమ్‌లో వచ్చినట్టు.. అసలు ఊహించని విధంగా వెల్లంపల్లిని పక్కనపెట్టి.. ఆసిఫ్‌ను ఇన్చార్జ్‌గా ప్రకటించడంతో.. ఆయనతో పాటు వెస్ట్ వైసీపీ కేడర్ కూడా షాక్ అయిందంట.పార్టీలో సీనియర్ అన్న పేరు తప్ప.. వెల్లంపల్లి తరహాలో సౌండ్ పార్టీ కాకపోవడంతో.. అసిఫ్‌ను టెంపరరీ ఇన్చార్జ్‌గా మాత్రమే ఉంచుతారని ఆ పార్టీ శ్రేణులు ఓపెన్‌గానే అంటున్నాయి. ఆసిఫ్‌కు పార్టీ సమన్వయబాధ్యతలు కట్టబెట్టినప్పటికీ నియోజకవర్గంలో కీలకనేతలెవరూ ఆయన్ని పలకరించిన పాపన పోలేదు వెల్లంపల్లి పక్క నియోజకవర్గానికి వెళ్లిపోవడంతో నిస్తేజంలో ఉన్న వైసీపీ కేడర్ కూడా అసిఫ్ కింద పనిచేయడానికి ఆసక్తి చూపించడం లేదంట.ఆ పరిణామాలకు తోడు.. తనను అడగకుండానే ఇన్చార్జ్ ప్రకటించడం.. అందరూ ఇన్చార్జులతో మాట్లాడిన సీఎం తన ముఖం కూడా చూడకపోవడంతో ఆసిఫ్ కూడా ఆ బాధ్యతలు టెంపరరీనే అని భావిస్తున్నారంట. పశ్చిమ క్యాడర్ నుండి సహకారం లేకపోవడం, అభ్యర్థిని మారుస్తున్నారనే ప్రచారంతో ఢీలాపడ్డ ఆసీఫ్‌కు అనుకోకుండా దెందులూరు సిద్ధం సభలో జగన్ ను కలిసే అవకాశం వచ్చింది. అయితే అక్కడ జస్ట్ జగన్ నమస్కారం మాత్రమే పెట్టారు. అప్పుడు తనకు పశ్చిమ ఇన్చార్జ్ అని చెప్పుకొనే అవకాశం కలిగినందుకు సంబరపడ్డారంట ఆయన.దాంతో రెట్టింపు ఉత్సహంతో సెగ్మెంట్లో తిరుగుతామని భావించినా.. కేడర్ పరంగా సహకారం లభించడం లేదంట. వెల్లంపల్లి కూడా అసిఫ్‌కు అందరూ సహకరించాలని పిలుపునిచ్చినా పెద్దగా ప్రయోజనం లేదంటున్నారు. మరోవైపు పార్టీ వర్గాలతో పాటు.. ప్రతిపక్షాలు కూడా ఆసిఫ్ అభ్యర్థి కాదని ఊదరగొడుతుండటంతో.. జగన్ నుంచి క్లారిటీ కోసం ఎదురు చూడాల్సి వస్తోందంట కొత్త ఇన్చార్జికి.. అందుకే ఒక్కసారి జగన్ ఆయనే అభ్యర్థి అని ప్రకటిస్తే చాలు ప్రాణంపెట్టి పార్టీని గెలిపిస్తానని స్టేట్‌మెంట్లు ఇస్తోంది ఆసిఫ్ వర్గం.. మొత్తానికి అలా నడిచిపోతోంది అక్కడ వైసీపీ రాజకీయం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com